
POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
జనవరి 2022
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 39 సంచిక: 09



స్వామి వివేకానంద జయంతి

*12-01-2022*



శ్రీ దత్త జయంతి (18-12-2021) సందర్భంగా పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ తల్లి సన్నిధిలో జరిగిన వేడుకలలో గురుపుత్రిక శ్రీమతి అడిదం వేదవతి, శ్రీ అడిదం శ్రీకాంత్ దంపతులు కన్నడ శ్రీ సాయి లీలామృతం(నూతన ముద్రణ), తమిళ శిరిడి హారతులు(నూతన ముద్రణ) గ్రంథాలు మరియు నూతన ఆంగ్ల సంవత్సరం 2022 క్యాలెండరు విడుదల చేశారు.

# అసలు పండుగలు చేసుకోవడమంటే ఏమిటి?

***పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ***

మన జీవితం గురించి లోతుగా ఆలోచిస్తే మన వ్యక్తిత్వానికి ఏమాత్రమూ ప్రాధాన్యమున్నట్లు తోచదు. మన దేహంలోని పదార్థమంతా బయట ప్రకృతినుండి అన్నపానీయాల రూపములో వచ్చినదే. దానిని మనదేహ రూపంలో నిలిపి జీవధర్మాలతో ప్రవర్తించేలా చేసే సూత్రం గూడా మనం నిర్మించుకొన్నది గాదు. అదే మనను, ఈ అనంతకోటి జీవరాశిని సృష్టించి నడిపిస్తున్నది. అది యీ సృష్టియంతటినీ చేసి ప్రకృతి సూత్రాల ననుసరించి నడిపించే విశ్వశక్తిలో అంతర్భాగమే! మన మనస్సులో చెలరేగే ఆలోచనలు, హృదయంలో పెల్లుబికే భావాలు, వాటి ననుసరించే మన ప్రవర్తన – యిందులో ఏదీ మనం నిర్ణయించుకొనేది గాదు. ఆ విశ్వశక్తి చేసిన యీ సృష్టియొక్క తత్త్వమే మన నిర్ణయాలనుగూడ అనుక్షణమూ రూపొందిస్తూంటుందని తోస్తుంది.

ఈ భావం స్పష్టంగానో, అస్పష్టంగానో మానవ జాతియంతటికీ యీ విశాలసృష్టిని చూడగానే కల్గుతుంది. ఈ భావమే ప్రపంచ చరిత్ర పొడుగునా విశ్వజనీనంగా ప్రకటమౌతూ వచ్చిన మత భావానికి మూలం. మానవ తాత్విక చింతన, వైజ్ఞానికమైన పరిశోధన మరియు అపారమైన భక్తిభావాలకూ మూలమైంది. ఈ సృష్టియంతటికీ కర్తయైన ఆ శక్తియే దైవమని చాలినంత లోతుగా గుర్తించిన సత్యద్రష్టలందరూ ఆయన అనుగ్రహానికీ, శక్తికి అబ్బురపడ్డారు. జీవులకు మాతృత్వము, వాత్సల్యము, గుడ్డులోనో లేక గర్భంలోనో పెరుగుతున్న జీవికి ముందుముందు అవసరమవ్వబోయే శారీరక మానసిక నిర్మాణం యిచ్చిన ఆ దైవమెంత దయామయుడో గుర్తించి జీవితమంతా ఆయనపట్ల కృతజ్ఞతతో ప్రవర్తించడమే మన జీవితానికంతటికీ మూలస్తంభమైంది. ఇందుకు సాధనంగా ప్రాకృతిక జీవితమంతటినీ రూపొందించుకొనడమే మతాల తత్త్వం. సం॥రం పొడుగునా అనేక వేడుకల, పండుగల రూపంలో ఆ భగవంతుడనుగ్రహించిన శక్తిసామర్థ్యాలకు, బాహ్యమైన ప్రకృతి సంపదకు అందరూ కలిసి కృతజ్ఞత తెల్పుకొనడమే అసలు పండుగలు చేసుకొనడమంటే! అటువంటివాటిలో సంక్రాంతి ఒకటి.

పండుగలు రెండు రకాలు. రాముడు, కృష్ణుడు వంటి అవతార పురుషుల జీవిత సంఘటనలకు సంబంధించినవి కొన్ని. దేవతలకు మాత్రమే సంబంధించి, అలా చెప్పబడే ప్రకృతిశక్తుల సామూహిక కార్యమైన సంవత్సర చక్రానికి సంబంధించిన పండుగలు కొన్ని. సంక్రాంతి, ఉగాది, కార్తీక ధనుర్మాసాలు మొ॥నవి యీ రెండవకోవకు చెందినవి. సం॥రం పొడుగునా ప్రకృతి రూపంలో భగవంతుడు మనకు చేసిన మేలుకు కృతజ్ఞతలు సామూహికంగా తెల్పుకొనేవే యీ పండుగలన్నీ. ఇలానే రోజంతటిలోనూ సంధ్యావందనము వైశ్వదేవమువంటి విధులు, దానము మొ॥న ధర్మాలు – అన్నీ భగవంతునికి ఆయన అంశలు, ప్రకృతి శక్తులూ అయిన దేవతలకు ఆధ్యాత్మికమైన అనుగ్రహ రూపాలైన ఋషులకు మనం తెల్పుకొనే కృతజ్ఞతలే. ఒక్కమాటలో చెప్పాలంటే నీతి, ధర్మాచరణ యావత్తూ భగవంతునిపట్ల కృతజ్ఞతతో గూడిన విధేయతే. భావమే! యిట్టి ఆచరణే అనుక్షణమూ భగవంతుని రూపాలైన జీవులన్నిటిపట్లా కల్గియుండాలని సాయిబాబా గూడ తమ ఆచరణద్వారా బోధించారు. వారి గురువుపట్ల వారికెంత కృతజ్ఞతో! ఆయన ప్రసాదించిన విలువలేని యిటుకరాయిని గూడ సాయి తమ ప్రాణంతో సమానంగా చూచుకొన్నారు. అది విరగడమంటే వారి ప్రారబ్ధం

***మిగతా 29వ పేజీలో***

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:39 జనవరి-2022 సంచిక:09

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన 'సాయిబాబా'

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | అసలు పండుగలు చేసుకోవడమంటే ఏమిటి? | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | సాయి సేవలో శ్రీమతి ప్రధాన్ స్మృతులు | (సేకరణ) ఒక రాజమండ్రి పాఠకుడు | 05 |
| 03. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 07 |
| 04. | ఆంగ్ల నూతన సంవత్సరాది | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 08 |
| 05. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 12 |
| 06. | మాతృదేవి స్మృతులు | శ్రీమతి పెద్దింటి విజయ | 16 |
| 07. | ప్రేమ స్వరూపుడు | శ్రీ కె. ఎస్.ప్రసాద్ | 18 |
| 08. | బయ్యాజీ అప్పాజీ పాటిల్ | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 22 |
| 09. | ద్వారకామాయి అనుభవమండపము | కె. సుబ్రహ్మణ్యం; బి.కె. దూబే; ఆరణి హనుమంతరావు | 24 |
| 10. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీ వేంకటేశ్వర్లు | 27 |


చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550

**www.saibharadwaja.org**
**www.saimasterforums.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

| | | |
|---|---|---|
| విడి ప్రతి | : | రూ. 10-00 |
| సంవత్సర చందా | : | రూ. 100-00 |

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

# సాయి సేవలో శ్రీమతి ప్రధాన్ స్మృతులు

*(సేకరణ) ఒక రాజమండ్రి పాఠకుడు*

తన భర్తకంటే మహాభక్తురాలైన శ్రీమతి ప్రధాన్ బాబా తన కుటుంబము నెలా అనుక్షణము రక్షించారో, వారెంత సర్వజ్ఞులో చెప్పినది ఆమె మాటలలోనే విందాము:

"నా బిడ్డ బాబు కొకసారి స్ఫోటకము వచ్చింది. వైద్యుడాశవదిలాడు. మేము నిరాశ చేసికొన్నాము. నేను నా దైవమైన బాబానేప్రార్థించాను.బాబాదర్శనమిచ్చి "ఎందుకేడుస్తావు? బిడ్డ యిప్పుడు బాగానే ఉన్నాడు. ఉదయము 6, 6.30 గంటలకు ఆహారమియ్యి" అన్నారు. తెల్లవారేటప్పటికి బిడ్డ ఆడుకొంటున్నాడు. నేను వెంటనే ఆహారమిచ్చాను. వైద్యుడు వచ్చి బిడ్డను చూసి ఎంతో ఆశ్చర్యపోయాడు. ఎందుకైనా మంచిదని ఆ రోజు ఆహారము ఏమీ పెట్టవద్దన్నాడు. కాని ఉదయమే బిడ్డకు ఆహారమిచ్చాననీ, అది అప్పుడే జీర్ణమైపోయిందనీ ఆ వైద్యునకు తెలియదు."

"నా బిడ్డకు అప్పుడప్పుడు మూర్ఛ వచ్చేది. ఒకనాటి రాత్రి 11 గంటలకు స్వప్నములో బాబా కనపడి "నిద్రపోతున్నావా? లే, లే , నీ బిడ్డకు మూర్ఛ వస్తుంది జాగ్రత్త" అన్నారు. నేను ఆత్రముగా లేచిచూస్తే బిడ్డ సుఖంగా నిద్రపోతున్నాడు. బాబా మాటలపై విశ్వాసముంచి వేడినీళ్ళు, నిప్పు, ఉడుకులోము వగైరా సిద్ధము చేసికొని నిద్రపోకుండా అలాగే కూర్చున్నాను. తెల్లవారు జామున 2 గంటలకు బిడ్డకు మూర్ఛ వచ్చింది, నేను అన్నీ సిద్ధముచేసికొని ఉన్నాను గనుక అరగంటకే తగ్గిపోయి బిడ్డకు ప్రమాదము తప్పింది. బాబా ముందుగానే స్వప్నములో నన్ను హెచ్చరించకపోతే ఏమయ్యేదో గదా!"

"ఒకసారి బాబా స్వప్నదర్శనమిచ్చి తమ పాదములవద్ద పసుపు, కాషాయము ఉంచమన్నారు. నేనలాగే వాటితో పూజ చేశాను (కలలోనే). ఈ కలనుగూర్చి నానాసాహెబ్ చందోర్కర్‌తో చెప్పగా ఆయన "వెండి పాదుకలు చేయించి శిరిడీ వెళ్లి బాబా పాదముల వద్ద వుంచి, వాటిని తెచ్చుకొని నిత్యపూజ చేసుకో" అన్నారు. నేనలాగే వెండి పాదుకలు చేయించుకొని శిరిడీ వెళ్ళాను. నన్ను చూడగానే బాబా రెండు కాళ్ళూ చాపి వెండి పాదుకలను వారి కాళ్ళపైనుంచి పూజచేసుకోమన్నారు. నేనలాగే చేశాను. బాబా వాటిని నాకిస్తూ ప్రక్కనే ఉన్న చందోర్కర్‌తో "ఈ తల్లి నా పాదుకలను ఛేదించి తీసుకొనిపోతోంది" అన్నారు. అంటే బాబా నా పూజ అంగీకరించారని ఎంతో సంతోషించాను."

"బాబా అప్పుడప్పుడు ఏ కారణము లేకుండానే అందరినీ ఎంతో కోపముతో తిట్టటము. కేకలు వేయటము చేసేవారు. ఒకసారి నేను శిరిడీ వెళ్ళినప్పుడు అలాగే చేస్తారనుకొన్నాను. బాబా అటువంటిదేదీ చేయలేదు సరికదా




నేను సాయంత్రము మశీదుకు వెళ్లినప్పుడు "నేనీరోజు ఎవరిమీద కూడా కోప్పడలే" దన్నారు. నేను మనస్సులో అనుకొన్నది వారికెలా తెలిసిపోయిందో!"

"ఒకసారి మశీదులో బాబాకు పూజ చేసుకొంటున్నాను. పూజ మధ్యలో నన్ను ఒకసారి వసతికి వెళ్ళిరమ్మన్నారు. అది గుర్వాజ్ఞ. అలాగే వసతికి వెళ్ళేటప్పటికి నా బిడ్డ గుక్కపట్టి ఏడుస్తోంది. పాలిచ్చి సముదాయించి మశీదుకు వచ్చి పూజ పూర్తి చేసుకొన్నాను. మశీదుకు మా వసతి ఎంతో దూరమైనా నా బిడ్డ ఏడుస్తున్నట్లు కన్నతల్లియైన నాకు తెలియపోయినా సాయిమాతకెలా తెలిసిందో?"

"ఒకసారి టైఫాయిడ్ జ్వరమున్న నా బిడ్డతో శిరిడీ ప్రయాణమైనాను. డాక్టరు వద్దన్నా లెక్కచేయలేదు. బిడ్డ రైలులో కూర్చోలేడు; పడుకోబెట్టాను. జబ్బుతో ఉన్న బిడ్డతో శిరిడీ వెడుతున్నందుకు సాటి ప్రయాణీకులు నవ్వుతారేమో అని సిగ్గుపడ్డాను. శిరిడీ చేరేటప్పటికి నా బిడ్డకు జ్వరము తగ్గి బాబా ఎదుట లేచి నించున్నాడు! బాబా నాకేసి తిరిగి "ఇప్పుడు ఎవ్వరూ నవ్వరులే" అన్నారు.

"బాబా సమాధి చెందిన మరునాటి రాత్రి నాకొక కల : "బాబా మరణావస్థలో యున్నారు. అది చూచి నేను 'బాబా చనిపోతున్నా'రన్నాను. బాబా 'సాధువులు చనిపోరు, సమాధి చెందుతార'న్నారు. బాబా శరీరము నిశ్చలమైంది. 'అక్కడున్న వారంతా ఏడుస్తున్నారు. నాకింక దుఃఖమాగలేదు' తెల్లవారేటప్పటికి అన్నాచించినీకర్ వద్ద నుండి విజయదశమినాడు బాబా సమాధి చెందినట్లు జాబు వచ్చింది."

"19-10-1918 రాత్రి నాకొక కల : "బాబా వచ్చి నాకు మూడు రూపాయలిచ్చారు. కలలో సొమ్ము తీసికొనుట అశుభమని బాధ కలిగింది. బాబా 'తీసికో, తీసికో నీ పెట్టెలో దాచుకున్నదంతా నాకియ్యి అన్నారు' ఉదయమేలేచి నేను నిజంగా పెట్టిలో దాచుకొనిన సొమ్మంతా బాబా కర్మ కాండకు షిర్డీ పంపివేశాను."

బాబా ఒకసారి నాతో 'ఎవరైనా నిన్ను పదిమాటలంటే అవసరమైతే ఒక్కమాటతో సమాధానము చెప్పు, ఎవరితోనూ కలహించకు' అన్నారు.

బాబా తమను నమ్మిన వారినెందరినో ఈ విధముగా పరిరక్షించారో మనము చెప్పలేము.•

# పరిప్రశ్న

***పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ***

**మీరు దత్తాత్రేయుడు సంపూర్ణమైన భగవదవతారమని, సద్గురువులందరూ ఆయన రూపాలేనని, అట్టివారిని ఆశ్రయించక మోక్షమేలేదని వ్రాస్తున్నారు. నా మిత్రులొకరు దత్తస్వామి యోగనాథుడు మాత్రమేనని, యోగము షడ్దర్శనాలలో ఒక్కటి మాత్రమే గనుక సాంఖ్యాది ఇతర సాంప్రదాయాలకు ఆయన గురువు కారని, ఆయన గురించి వేదాలలో ప్రస్తావన లేదని, ఆయన గురించి ఒక్క ఉపనిషత్తుకూడ లేదనీ, దశావతారాలలో ఆయన పేరు లేదని కనుక ఆయన సంపూర్ణమైన భగవదవతారము కాదని, మనకు శ్రీకృష్ణుడొక్కడే ప్రమాణమని అంటున్నారు. మీ సమాధానమేమిటి?**

- ఎమ్. రాధాక్రిష్ణ, హైదరాబాదు.

**జవాబు:-** శ్రీ కృష్ణుడు మనకు ప్రమాణమని అంగీకరిస్తే సృష్ట్యాదిలో వివస్వంతుడు – మనువు ఇక్ష్వాకులకు తననుండి ప్రాప్తించి తర్వాత కాలాంతరములో శిథిలమైన యోగవిద్యను తాను మరల బోధిస్తున్నానని అర్జునుడికి బోధించిన యోగవిద్యకూ, మీ మిత్రులు తలచే యోగవిద్యకు సంబంధమేలేదు. సర్వకాల సర్వావస్థలలోనూ చలించని సమత్వము, యజ్ఞ దాన తపః కర్మలనుండీ యుద్ధాది స్వధర్మాచరణదాకా అన్నింటినీ అట్టి భావముతో నిర్వహించే కౌశలమే యోగమనీ చెప్పాడు శ్రీకృష్ణుడు. దానివల్లనే మీమాంసలో చెప్పబడిన కర్మ, కల్పంలో చెప్పబడిన యజ్ఞాదులు ఉత్తమ పురుషార్థాలవుతాయని కృష్ణుని భావం. జీవితమంతటినీ పరమార్థ సాధనంగా మార్చేదే యోగమని ఆయన భావం. ఆయన బోధను గ్రంథస్థం చేసిన వ్యాసుడికి అది సమ్మతమే. కనుక శ్రీ దత్తాత్రేయుడు యోగనాథుడన్నపుడు సకల మోక్షవిద్యలకు ఆయన మూల పురుషుడు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వర, పరబ్రహ్మలు ఏకమైన విశ్వజనీనమైన గురు స్వరూపమాయన. రావణ దుర్యోధనాది దానవ సంహరణ, భూభార నిర్వహణాది పరిమిత కార్యాన్ని నిర్వర్తించేవాడు గాదు. కనుకనే ఆయన తనను తాను దత్తం చేసుకున్న అయోనిజ సంభవుడు. గీతా శాసనాన్ననుసరించి జన్మించిన ప్రతివారూ మరణించవలసినదే. కాని శ్రీ దత్తాత్రేయుడు మరణ రహితుడు. విశ్వసృష్టి వికాసంకోసం తపస్సు చేసిన అత్రి, అనసూయల తపఃఫలం! ఆయన పూర్ణావతారం కాకుంటే యింకెవరు? ఈయన కార్తవీర్యార్జునుడికి అష్టాంగయోగము, యదు ప్రహ్లాదులకు అవధూత రూపంలో జ్ఞానమార్గాన్ని బోధించినవాడు.

ఇక పురాణాలలో అవతారంగా ఆయన పేర్కొనబడలేదనడం అసత్యం. హరివంశము, విష్ణుపురాణము, భాగవతములలో దత్తాత్రేయుడు మత్స్య, కూర్మ, కృష్ణ అవతారాలతో సమంగా పేర్కొనబడ్డాడు. భారతము శాంతి పర్వములోని తొమ్మిదింటిలో

***మిగతా 29వ పేజీలో***

# ఆంగ్ల నూతన సంవత్సరాది

**_పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ_**

_(జనవరి 2011 సాయిబాబా మాసపత్రిక నుండి)_

జనవరి 1. ఆంగ్లేయుల నూతన సంవత్సర ప్రవేశం. కాలాన్ని గురించిన వారి వారి అవగాహనను బట్టి, అంచనాల ప్రకారం కాలాన్ని అనేక సాంప్రదాయాలవారు అనేక రకాలుగా విభజించుకున్నారు. కానీ ఎవరి లెక్కల ప్రకారం చూసినా కొద్దిగా అటూ యిటూగా అందరి అంచనాలు ఒకే విధంగా వుండడం గమనార్హం. కనుక కాలం ఒక నిర్దుష్ట ప్రణాళిక ప్రకారం నడుస్తుండడం మాత్రం వాస్తవం. అయితే 'ఈ కాలాన్ని యిలా విభజించుకోవడము, నిర్ద్ధేశించుకోవడమూ ఎందుకు? ప్రకృతిపరంగా అన్నీ జరిగిపోతుంటాయి గదా! మనమూ అలాగే వుంటే సరిపోదా! సృష్టిలోని ఏ జీవికీ లేని ఈ ఆలోచన మనకెందుకు వచ్చింది?' అన్నది ప్రశ్న. దీనికి సమాధానం గూడ మామూలే. మానవుడు మనస్సు గలవాడు గనుక, మనస్సు వూరికే వుండలేదు గనుక అన్ని విషయాల వలెనే ఈ విషయాన్ని గురించి గూడ ఆలోచించడం జరిగింది అని. ఈ సమాధానం సరియైనదే. కాలాన్ని యిలా విభజించుకోవడం వలన వుండే ప్రయోజనాలు గూడ మనకు తెలిసినవే. ఇలా చేయడం వల్ల ఒక నిర్దుష్ట ప్రణాళిక ప్రకారం ఏ వ్యవహారమైనా చేసుకోవచ్చు. ఇలా కాలాన్ని విభజించుకోకపోతే చాలా పనులు సజావుగా జరగడానికి అవకాశం లేదు. కనుక కాలాన్ని విభజించి కాలమానాన్ని తయారు చేసుకోవలసిందే. అప్పుడే అన్నీ సక్రమంగా జరగడానికి అవకాశం వుంది.

అయితే ఈ 'సక్రమంగా' అన్న పదానికి అర్థమేమిటి? – సక్రమంగా పనిచేయడం అంటే ఏమిటి? సక్రమంగా పనిచేయకపోతే ఏమవుతుంది? అనే విషయం కొంచెం ఆలోచిద్దాము.

సృష్టిలో ప్రతిదీ ప్రకృతి నిర్దేశించిన ప్రకారం సక్రమంగా పనిచేస్తుంటుంది. ఉదాహరణకు సూర్యుడు మొ॥న గ్రహగోళాలు గతి తప్పకుండా సక్రమంగా పనిచేస్తాయి. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరగడము, అలాగే ఇతర గ్రహగోళాలూ ఒక క్రమ పద్ధతిన తిరగడమూ జరుగుతూ వుంటుంది. అలాగే మన శరీరంలో గుండె, శ్వాస కోశము, మెదడు మొ॥నవి విరామం లేకుండా సక్రమంగా పనిచేస్తుంటాయి. అలా సక్రమంగా పని చేస్తుంటేనే సృష్టి సజావుగా సాగడానికి అవకాశం వుంది. సూర్యచంద్రాదులు ఏమాత్రం గతి తప్పినా, అలాగే శరీరగత అవయవాలు గతి తప్పినా జీవనం

అస్తవ్యస్తమవుతుంది.

అంతేగాదు. సృష్టిలోని గ్రహగోళాలే గాక సకల చరాచర జీవజాలము ఒక నిర్దుష్ట కాలపరిమితి ప్రకారం పని చేస్తుంటుంది. సూర్యచంద్రాది గ్రహగోళాలు నిర్దుష్టకాలంలో పనిచేయడం వల్ల పగలు, రాత్రి ఏర్పడడము, ఋతువులు ఏర్పడడము జరుగుతుంది. అందువలన ప్రకృతిలోని సకల జీవరాశి జన్మించడము, జీవించడము, మరణించడము జరుగుతుంది.

అందువలన ప్రకృతిలోని ప్రతీదీ కాలానుగుణ్యంగా ప్రవర్తించడం జరుగుతుంది. ఋతువుల ప్రకారం ఎండ, వాన, చలి రావడము, పంటలు పండడము మొIIనవన్నీ జరుగుతాయి. అలాగే జీవులు రాత్రి నిద్రించడము, పగలు మేల్కొనడము జరుగుతుంటుంది. ఒకవేళ ఏదైనా కాలాన్ననుసరించి ప్రవర్తించకపోతే జీవన వ్యవస్థ దెబ్బతింటుంది. ఉదాహరణకు ఋతువుల ప్రకారం ఎండ, వాన, చలి రాకపోతే అంటే ఎండాకాలంలో వర్షాలు, అలాగే వర్షాకాలంలో ఎండలుగానీ వస్తే సృష్టిలో అస్తవ్యస్తమేర్పడుతుంది. అలాగే ఎవరైనా పగలు నిద్రించడము, రాత్రి మేల్కొనడము జరిగితే ఆరోగ్యం దెబ్బతింటుంది.

అంతేగాదు, ప్రకృతిలోని ప్రతీదీ కాలానుగుణ్యంగానే ప్రకృతి నిర్దేశించిన ఒక ధర్మం ప్రకారం ప్రవర్తిస్తుంటుంది. అంటే కాలానుగుణ్యంగా వేటి ధర్మాన్ని అవి నిర్వర్తించకపోతేగూడ జీవన వ్యవస్థ దెబ్బతింటుంది. అసలు ధర్మం అంటే ఏమిటి?

ధర్మాన్ని సామాజిక ధర్మము,



వ్యక్తిగత ధర్మము - అంటే శారీరిక ధర్మము, మానసిక ధర్మము అని మూడు విధాలుగా విభజించవచ్చు. సృష్టిలోని ప్రతిదీ (చలనము లేనివి గానీ, చలనము గలవి గానీ) ప్రకృతి సిద్ధమైన తమ ధర్మాన్ననుసరించి ప్రవర్తిస్తుంటాయి. కానీ మనిషికి మనస్సుంది గనుక తనకు తోచిన విధంగా ప్రవర్తించడానికి ప్రయత్నిస్తాడు. ఈ క్రమంలో అతడు సామాజిక, శారీరిక, మానసిక ధర్మాల ప్రకారం నడచుకుంటే నడచుకుంటాడు, లేకపోతే లేదు.

ఉదాహరణకు సకల జీవరాశి ప్రకృతి సిద్ధమైన ధర్మం ప్రకారం సూర్యోదయంతో జాగృతిని పొంది సూర్యాస్తమయం తర్వాత నిద్రిస్తాయి. ఆహారం కోసం అన్వేషించి ప్రకృతి వాటికి నిర్దేశించిన ఆహారాన్ని తీసుకుంటాయి. అలాగే మానవునికి గూడ వుండవలసిన శారీరిక ధర్మం అదే అయినప్పటికీ అతడు యిచ్ఛానుసారం ఎప్పుడైనా, ఎన్నిసార్లయినా తీసుకోవచ్చు. అలానే సమయాసమయాలతో సంబంధం లేకుండా నిద్రపోనూవచ్చు.

ఇక్కడ మరొక విషయం గూడ వున్నది. ఒకవేళ కాలనుగుణ్యంగా ప్రకృతి ధర్మాలననుసరించి ప్రవర్తించినప్పటికీ ఇతర జీవులతో సామరస్యాన్ని గూడ పాటించవలసి వున్నది. అంటే ఒక జీవి వల్ల మరొక జీవికి యిబ్బంది కలగకుండా, నష్టపోకుండా ప్రవర్తించవలసి వుంటుంది. సృష్టిలో ఒక జీవి యొక్క మనుగడ వల్ల మరొక జీవి మనుగడకు నష్టం వాటిల్లకపోవడం మనం చూస్తున్నాము.

ఈ సామరస్యత ఎప్పుడైతే లోపిస్తుందో అప్పుడు ప్రకృతిలో సమతుల్యత లోపిస్తుంది. అప్పుడు

ప్రకృతిలో వైపరీత్యాలు సంభవిస్తాయి. అంటే సమతుల్యతను నిలపడం కోసం వైపరీత్యాల ద్వారా ప్రకృతే తగురీతిన ప్రవర్తిస్తుందన్నమాట.

సృష్టి సజావుగా సాగడానికి మూడు రకాలైన ధర్మాలను పాటించవలసి వుంటుందని చెప్పుకున్నాము.

మొదటిది సామాజిక ధర్మం. అంటే సాటి మనుషుల పట్ల మాత్రమే గాదు, ఇతర ప్రాణుల పట్ల కూడా సామరస్యంగా జీవించడం.

పూర్వకాలంలో మానవులు ప్రకృతిలోని సహజసంపదను అవసరమైన మేరకు ఇతరములైన వేటికీ నష్టం వాటిల్లని రీతిన వినియోగించుకునేవారు. అందువలన సృష్టిలో సామరస్యము, సమతుల్యత దెబ్బతినేవి కావు. నేడు ఆధునిక విజ్ఞానం అభివృద్ధి చెంది మన సుఖసౌఖ్యాల కోసం అవసరాలకు మించి ప్రకృతి నుండి పిండుకోవడం ఒకవైపు, రసాయనోత్పత్తుల ద్వారా మరొకవైపూ ప్రకృతికి హాని కలిగించడం జరుగుతున్నది.

ప్రకృతిలో సహజంగా వున్న వనరులను సహజరీతిన వినియోగించక కృత్రిమ పద్ధతుల ద్వారా వినియోగించడం వల్ల నష్టాలు మనకు తెలిసిన విషయమే. ఉదాహరణకు సహజ ఎరువుల ద్వారా పంటలు పండించక కృత్రిమ రసాయనాల ద్వారా పండించడం వల్ల కలుగుతున్న నష్టాలను తెలుసుకుని నేటి శాస్త్రజ్ఞులు నేడు సహజ ఎరువులకు ప్రాధాన్యతనివ్వడం గమనార్హం.

నేడు మన సౌకర్యాల కోసం, అవసరాల కోసం పదార్థాల, పరికరాల ఉత్పత్తులకోసం స్థాపించిన పరిశ్రమల ద్వారా, వాటి వలన తయారైన వివిధ రకాలైన ఉత్పత్తుల ద్వారా కాలుష్యం ఏర్పడి పర్యావరణంలోని సమతుల్యత దెబ్బతింటున్నది. అందువలన ఎన్నో క్లిష్ట సమస్యలను మనం ఎదుర్కోవలసి వస్తున్నది. రాబోయే కాలంలో యిది యింకా ప్రమాదకరంగా పరిణమిస్తుందని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. అందుకని సామాజిక ధర్మం పాటించడం అవసరమని తెలుస్తున్నది.

రెండవది శారీరిక ధర్మం. నేటి పరిస్థితుల దృష్ట్యా శారీరిక ధర్మాలు గూడా చాలా విషయాలలో మారిపోయాయనే చెప్పవచ్చు. ఆహార విషయంలో దాదాపు ఎవరూ సమయాసమయాలు పాటించడం లేదు. ఆహార విషయంలో తగు జాగ్రత్త వహించకుండా నోటికి రుచికరమనిపించిన పదార్థాలను ఇష్టమొచ్చినట్లు సేవించడం జరుగుతున్నది. నేడు మార్కెట్లో లభ్యమయ్యే తినుబండారాల వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని తెలియనివారు, తెలిసినవారూ గూడ వాటిని తినడం జరుగుతున్నది. ఇక నిద్ర విషయం చెప్పుకోవడానికేమున్నది? ఈనాటి చదువులు, కార్పొరేట్ ఉద్యోగాలు, టి.వి.లు, సినిమాలు, క్లబ్బులు, పబ్బులు యిలా అనేక కారణాలుగా సమయానికి నిద్రపోయేవారు చాలా తక్కువమందేనని చెప్పవచ్చు. ఇక శరీర శుభ్రతకు, సౌందర్య పోషణకు ఉపయోగించే షాంపూలు, సబ్బులు, క్రీములు మొ॥న వాటి వల్ల శరీరానికి కలిగే నష్టం యింతా అంతా కాదు. ఈ కారణాలుగా శరీరారోగ్యం దెబ్బతినక తప్పదు. అందుకనే నేడు మనమందరమూ అనేక శారీరిక బాధలలో సతమతమవుతున్నాము.

ఇక మూడవది, అతి ముఖ్యమైనది. మానసిక ధర్మం. మనస్సు ధర్మం ప్రకారం నడవకపోతే – అంటే అధర్మంగా నడుస్తుంటే అట్టి అధర్మ ప్రవర్తకుని వలన ఇతరులకు ఎంత కష్టం కలుగుతుందోనన్నది మనపట్ల ఇతరులైవరైనా అధర్మంగా ప్రవర్తించినప్పుడు గానీ తెలియదు. అంటే మనసికంగా గూడ సాటి జీవుల పట్ల ప్రేమతో, సామరస్యంతో ప్రవర్తించడం అవసరమన్నమాట.

ఇతరులు మనకేది చేయాలనుకుంటామో అది ఇతరులకు మనం చేయడం ధర్మమని పెద్దలు చెప్పారు. నేడు మానవులలో స్వార్థం పెరిగిపోవడం వల్ల ఉన్నదానితో సంతృప్తి చెందలేక లేనిదేనికోసమో తపన పడుతూ తాను కావాలనుకున్నవీ తనకు లేనివీ ఇతరులకుంటే ఓర్వలేక వారికి లేకుండా పోవాలనే ఆకాంక్ష, లేకుండా చేయడానికి ప్రయత్నము, ఇతరులకు లేకపోయినా ఫర్వాలేదు, మనకుంటే చాలు అనే స్వార్థపూరితమైన ఆలోచనలతో నేటి సమాజం కుతకుతలాడిపోతున్నది. ఇట్టి ఆలోచనల వల్ల డబ్బు, హోదా మొ॥న వాటిలో సుఖంగా జీవించవచ్చన్న ఆశతో యింకా యింకా సంపాదించాలన్న తపనతో నిజమైన సంతోషాన్నీ, శాంతినీ పొందలేకపోతున్నారు.

ఉదాహరణకు ఇదివరకు కుటుంబంలోని వారందరూ ఎవరి కర్తవ్యం వారు నిర్వర్తించేవారు.

మగవాళ్ళు సంపాదన బాధ్యత వహిస్తే ఆడవాళ్ళు ఇంటి పనులు, పిల్లలను చూసుకుంటుండేవాళ్ళు. మగవాళ్ళు ఎంత సంపాదిస్తే అంతలోనే ఆడవాళ్ళు ఇంటి నిర్వహణ చేసేవాళ్ళు. ఆడవాళ్ళకు సమయం వుండడం వల్ల పిల్లలతో ఎక్కువ సమయం గడపడానికి అవకాశం వుండేది. ఈనాడు డబ్బు సంపాదించడం ప్రధాన లక్ష్యంగా ఏర్పడడం వల్ల ఆడవాళ్ళుగూడ ఉద్యోగాలు చేయవలసి వస్తున్నది. అందువలన వారు యిటు గృహ నిర్వహణ చేయలేక, పిల్లలనూ సరిగా పెంచలేకపోతున్నారు. తల్లిదండ్రులిద్దరూ సంపాదన ప్రక్రియలో తీరిక లేకుండా వుండడం వల్ల పిల్లలతో గడపడానికి వారికి సమయం వుండడం లేదు. దానితో పిల్లలకు తల్లిదండ్రుల వద్ద నుంచి రావలసిన, వారు కోరుకునే ఆప్యాయత కొరవడి పిల్లలకు మానసికంగా ఏదో తెలియని వెలితి ఏర్పడుతున్నది. అంతేగాక తల్లిదండ్రులకు వున్న స్వార్థ పూరితమైన ఆలోచనల వల్ల, చర్యల వల్ల పిల్లలకు గూడ అట్టి స్వార్థపరత్వం రావడానికి అవకాశం వుండి వారు తల్లిదండ్రులను ప్రేమ, గౌరవాలతో చూడలేకపోతున్నారు. ఏ శాంతి, ప్రేమలకోసమైతే డబ్బు, హోదా మొ॥న జీవితావసరాలు కావాలని మనిషి ప్రాకులాడుతున్నాడో అవే ఈనాడు కరువైపోతున్నాయి. సమయం లేక కొందరు, పిల్లలను పెంచడం కష్టమనే అభిప్రాయంతో కొందరూ పిల్లలను 2-1/2 సంవత్సరాలకే స్కూళ్ళకు పంపిద్దామని తల్లిందండ్రు లనుకుంటుంటే, తల్లిదండ్రులను చూడడం కష్టమనుకుని వాళ్ళను వృద్ధాశ్రమంలో చేర్పిద్దామని పిల్లలు భావిస్తున్నారు. అందువలన మానసిక కాలుష్యం చోటు చేసుకుంటున్నది. అందువలన కుటుంబ వ్యవస్థ దెబ్బతింటున్నది. పూర్వములాగా ఉమ్మడి కుటుంబాలు లేకపోయినా ఒకే కుటుంబంలోని వారు అంటే తల్లి, తండ్రి, కొడుకు, కోడలు, మనవళ్ళు, మనవరాళ్ళు కలిసి వుండడం గూడ కష్టమవుతున్నది. అంతేగాక ఇట్టి స్వార్థపరత్వంతో మానవ సంబంధాలు కొరవడడమేగాక ఒకరితోనొకరు నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించడమేగాక, అతి దారుణంగా ఒకరినొకరు చంపుకుంటున్నారు. మన ఆహారం కోసము, వినోదం కోసము అవసరానికి మించి సాటి జీవులను చంపడం వలన కొన్నాళ్ళకు ఆ జీవజాతులు అంతరించిపోయే అవకాశం వుంది. ఈ విధంగా ప్రకృతిలోని పశుసంపదను, వృక్షసంపదను, ఇతర వనరులనూ దుర్వినియోగ పరచడం వల్ల పర్యావరణకు నష్టం వాటిల్లుతుంది.

కనుక అధర్మప్రవర్తన వల్ల అన్ని రంగాలూ దెబ్బతిని, అన్ని విధాలుగానూ కాలుష్యం ఏర్పడుతుంది. అందువలన ప్రజల శారీరిక, మానసిక, సామాజిక పరిస్థితులు అస్తవ్యస్త మవుతాయి. అందువలన మానవ మనుగడకు అవరోధం ఏర్పడుతుంది.

సృష్టి కాలాన్ని శాసిస్తుంది. కాలం సృష్టి మనుగడను శాసిస్తుంది. ఇవి రెండూ పరస్పరానుబంధాలు. కాలం ఎంతో విలువైనది. జీవితం అంతకంటే విలువైనది. గడచిన కాలం తిరిగి రాదు. కనుక కాలధర్మం ప్రకారం ప్రకృతి ధర్మాలననుసరించి సామాజిక, శారీరిక, మానసిక విషయాలన్నింటితోనూ ప్రకృతిలోని అన్నింటితోనూ సామరస్యంగా మెలగడం నేర్చుకోవాలి. అదే అసలైన ఆధ్యాత్మికత. ఆధ్యాత్మికత పేరుతో దేవతలనూ, మహాత్ములనూ ఆరాధిస్తూ ఇతర జీవులతో సామరస్యం లేకుండా జీవించడమంటే ఆధ్యాత్మికత పేరుతో సమాజాన్ని వినాశనం చేయడమేనన్నమాట. సృష్టినంతటినీ వినాశం చేయడానికి ఇది అన్నింటికంటే ఎక్కువదైన, అన్నింటికంటే నీచమైన పద్ధతి. అంతకంటే ఘోరమైనది మరొకటి లేదు. అంతకంటే ఆధ్యాత్మికత పేరు లేకుండా కాలధర్మం ప్రకారం ప్రకృతి ధర్మాలను పాటిస్తూ సాటి జీవుల పట్ల సామరస్యంతో జీవించగలవాడే నిజమైన ఆధ్యాత్మవేత్త. అందుకని స్వార్థపూరితమైన నీచ ప్రవృత్తి కలిగిన మనలోని హీనజాతివాడిని వెళ్ళగొట్టాలి. అప్పుడే కాలాన్ని సద్వినియోగ పరుచుకున్నవాళ్ళమవుతాము. ఈ నూతన ఆంగ్ల సంవత్సరంలో మనలోని స్వార్థ, మమకార, అసూయ, ద్వేషాది హీనజాతివాళ్ళను వెళ్ళగొట్టి పైన చెప్పుకున్నట్లు ఆయా ధర్మాలననుసరించి సాటి జీవుల పట్ల సామరస్యంతో మెలుగుతూ ప్రకృతిలోని అంశమైన మనం ప్రకృతిని అన్ని విధాలా సద్వినియోగ పరచుకుంటూ, కాపాడుకుంటూ తద్వారా మనమూ శ్రేయస్సును పొందే ప్రయత్నం చేద్దాము.

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

శ్రీమతి అడిదం వేదవతి

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

## ఎనిమిదవ ప్రసంగము

సాధువు : తన దగ్గర గోచీగుడ్డ మాత్రమే వున్నా దానిపట్ల 'నాది' అనే భావన వుంటే అది బంధనము. కానీ లక్షల కొద్దీ ధనము వున్నప్పటికీ 'నాది' అనే భావన లేకపోతే బంధనము కాదు.

జిజ్ఞాసువు : మమత్వము ('నాది' అనే భావన) లేకపోతే వస్తువులను సేకరించడం ఎలా సాధ్యం? వశిష్ఠ మహర్షి సమర్థుడైనా కుటీరంలో నివసించేవాడు. ధనము సంగతి అలా వుంచండి. రెండవ రోజుకు కావలసిన బియ్యము కూడా ఆయన కూడబెట్టేవాడు కాదు. మీరు భగవంతుని వాక్యాలను అంగీకరిస్తారని చెబుతున్నారు.

శిష్యవర్గము : సద్గురువులు సాక్షాత్తూ కృష్ణ స్వరూపులు. వారికి భగవద్గీత ప్రమాణము కానవసరం లేదు.

జిజ్ఞాసువు: సద్గురువులకు భగవద్గీత ప్రమాణం కాకపోవచ్చు. మీరు అయినా గీతను అంగీకరిస్తున్నారా?

శిష్య : మా సద్గురువులు మాకు కృష్ణభగవానుని వంటివారు. వారి మాటలను అతిక్రమించి మేము భగవద్గీతను మాత్రము ఎలా అనుసరించగలము?

జిజ్ఞాసువు : పురాణాలలో ఇలానే చెప్పబడివున్నది. కలియుగంలో శ్రుతి, స్మృతి, పురాణాలను ప్రమాణంగా అంగీకరించరు. రాత్రి, పగలు కూడా ధనాన్నే ఉపాసిస్తారు. అసురప్రవృత్తి కలిగిన వాక్యాలనే ప్రమాణాలుగా తీసుకుంటారు. ఇది అంతా పురాణాలలోని భవిష్యవాణి.

*గతా గీతా నాశం క్వచిదపి పురాణం వ్యపగతం*
*విలీనాః స్మృత్యర్థాః నిగమనిచయో దూర మగమత్ ।*
*ఇదానీం రైదాస ప్రభృతివచనైర్మోక్ష పదవీం*
*తదేవం జానీమో కలియుగః తవైవైష మహిమా ॥*

భావము: గీత నశించింది. పురాణాలు పోయాయి.

స్మృతులు అడుగంటాయి. వేదాలు అంతరించాయి. ఇప్పుడు ధనదాసుల (ధనాన్ని సేవించేవారి) వాక్యాలే మోక్షాన్ని ప్రసాదించేవి. ఇదంతా కలి ప్రభావము.

కాబట్టి ధనదాసుడైన మీ సద్గురువుల వాక్యాలు కూడా ప్రమాణం అనే మాట నిజమే.

భగవద్గీత మీద వేలకొలదీ టీకలు వ్రాయబడ్డాయి. ఎన్నోచోట్ల ప్రవచనాలు జరుగుతుంటాయి. ఇళ్ళలో నిత్య పారాయణలు కూడా జరుగుతూ ఉంటాయి. గీతాజయంతులు కూడా చాలానే జరుపుకుంటారు. కానీ భగవద్గీతను అనుసరించేవాడు దొరకడం ఎంతో దుర్లభము.

ఒక గ్రామంలో ఇద్దరు స్నేహితులు వుండేవారు. వారిలో ఒకడు నిత్యము గీతాపాఠము చేసేవాడు. తన మిత్రుని కూడా గీత చదవమని చెప్పేవాడు. కొద్ది రోజుల తరువాత అతడు మిత్రుడిని అడిగాడు– "భగవద్గీత చదువుతున్నావా?" అతడు ఇలా సమాధానం చెప్పాడు: "నేను ఒకేసారి చదివాను. గీతాసార వాక్యమైన 'సర్వధర్మాన్ పరిత్యజ్య', 'అన్ని ధర్మాలను విడిచిపెట్టు' అనేదానిని జీవితసూత్రంగా తీసుకున్నాను."

ఇప్పుడు మీలో చాలామంది ఈ మాటనే సూత్రరూపంగా తీసుకుంటారు. దైవీసంపదను వదిలి అసుర సంపదను స్వీకరిస్తారు.

త్ర్యంబక భాయి : 'అపరిగ్రహః', 'సమలోష్టాశ్మ కాంచనః', 'యోగక్షేమం వహామ్యహమ్' అని గీతలో చెప్పిన మాటలు గృహస్థులు ఎవరైనా ఆచరించగలరేమో గాని 'అనికేతః' 'ఇల్లు లేకుండా ఉండుము' అనే దానిని ఎలా అనుసరించగలరు? గృహస్థుకు ఇల్లు కావాలి కదా?

స్వామి ప్రకాశానంద: 'అనుదరా దేవదత్తకన్యా' అనే మాటకు అర్థము దేవదత్తునికి కుమార్తె అసలు కడుపు లేనిదని కాదు. అలాగే 'అనికేతః' అనినంత మాత్రాన ఇల్లు ఉండకూడదని అనుకోవడం కంటే చిన్న ఇల్లు వుండాలి అని తెలుసుకోవడం మంచిది. వశిష్ఠుడు మొదలైన మహర్షులు కూడా చిన్న కుటీరాలలో నివసించేవారు.

తుకారాము తన అభంగ లో ఇలా చెప్పాడు:

"నేను బలమైన గృహాన్ని నిర్మించుకున్నాను. ఇంటికి నిర్మాణ సామాగ్రి ఖరీదైన టేకు మొదలైన కలప కాదు. కేవలం తాటాకు, పైకట్టడానికి పనికిరానిది. మా ధనధాన్యాలు నేను మా ఇంట్లో ఉంచుకోలేదు. ప్రజల ఇళ్ళల్లో నిలువ చేసుకున్నాను. కాబట్టి అడుగుకొని తెచ్చుకుంటున్నాను. ఆస్తిపాస్తులు వుంటే రక్షించుకోవలసి వస్తుంది. కాబట్టి అటువంటి బెడద ఏమీ ఉంచుకోలేదు. నాకు ఏ విషయంలోనూ విచారం లేదు. నిశ్చింతగా ఉన్నాను. నేను పేదవాడినే. కానీ నా మనసు చాలా అదృష్టవంతురాలు.

దొంగలకు నా యింటికి రావాలనే కోరిక కూడా వుండదు. బయటకు వెళ్ళినప్పుడు నా ఇంటి తలుపు తీసివున్నదా, వేసివున్నదా అనే బాధ లేదు. కాపలా పని కుక్కలే చేస్తాయి.

నా ఆస్తి మట్టికుండ, గోమయము (ఆవు పేడ). వాటి

సహాయంతో ఇల్లు, తులసీవనము అలికి శుభ్రంగా ఉంచుకున్నాను. గిన్నెలు, చెంబులు మొ॥న సాధన సామాగ్రి నేను ఉంచుకోలేదు. ఉంచుకోవలసిన అవసరమూ లేదు. వాటితో ఎవరు వ్యర్థముగా బుర్రలు బద్దలు కొట్టుకుంటారు?

భగవంతుడు చాలా విషయాలలో నన్ను నిశ్చింతగా ఉండనిచ్చాడు. మా విషయవాసనలన్నీ నిర్మూలించాడు. ఇక మా యోగక్షేమాలన్నీ ఆయనవే. మా కుటుంబానికి కూడా అయనే ఆధారము. అందువలన పొందవలసిన సంపదను, అధికారాన్ని (అర్హతను) పొందడానికి ప్రయత్నిస్తాను."

ఇటువంటి మహానుభావులు దైవీసంపత్తి కలవారు. ఇప్పుడు అందరూ విలాసవంతమైన జీవితము గడిపేవారే. ఆచరణ లేనిదే స్వరూప సాక్షాత్కారము లభించదు.

## భగవద్గీతలో ఉపదేశించిన అసుర, రాక్షస ప్రవృత్తులు

స్వామి నిత్యానంద : వేరే ఆచరణ వున్నా లేకపోయినా జిజ్ఞాసువులు అడిగిన వాటికి సమాధానము చెప్పడం మన ధర్మము.

స్వామి ప్రకాశానంద: స్వరూప సాక్షాత్కారానికి మొదట రాక్షస ప్రవృత్తిని, తరువాత అసుర ప్రవృత్తిని విడిచిపెట్టి దైవీసంపదను సంపాదించి పరమాత్మను భజించాలి. రాక్షస, అసుర ప్రవృత్తులనుండి పూర్తిగా విముక్తులయ్యేవరకూ దైవప్రకృతి లభించదు.

భగవద్గీత ఇలా చెబుతున్నది:

*శ్లో॥ మోఘాశా మోఘకర్మాణో*
*మోఘజ్ఞానా విచేతసః I*

**రాక్షసీ మాసురీం చైవ**
**ప్రకృతిం మోహినీం శ్రితాః ll**

భావం: నిరుపయోగకరమైన ఆశ, ఉపయోగం లేని కర్మలు, నిరర్థకమైన జ్ఞానాన్ని కలిగిన వివేకహీనులైన ప్రజలు మోహానికి ఆధారమైన రాక్షస, అసుర ప్రకృతులలో వుంటారు.

విచేతసః : ఆత్మానాత్మ వివేకం లేనివారు. ఉదాహరణకు ఉపనిషత్తులలోని ఇంద్ర విరోచనోపాఖ్యానంలో విరోచనుడు ఆత్మానాత్మ వివేకము చేయలేనివాడు.

మోఘజ్ఞానా : ఈశ్వర ప్రతిపాదనే చేయడు. చార్వాకమతాన్ని అనుసరిస్తాడు. స్వర్గనరకాలు, బంధమోక్షాలు, ఈశ్వరునితో సృష్టింపబడిన వేదాలనూ నమ్మడు. ఇటువంటి అసుర ప్రకృతి కలవారిని వర్ణిస్తూ భగవద్గీతలో 16వ అధ్యాయంలో భగవానుడు ఇలా అన్నాడు.

## అసురసంపత్తి కల లోకము

*శ్లో॥ అసత్యమప్రతిష్ఠం*
*జగదాహురనీశ్వరమ్ l*
*పరస్పర సంభూతం*
*కిమన్యత్ కామహైతుకమ్ ll*

భావం :- అసుర సంపత్తి కలవాడు జగత్తు అసత్యమని భావిస్తాడు. అంటే వేదశాస్త్రాలన్నీ అసత్యాలంటాడు. అంతేకాదు, జగత్తుయొక్క ఉనికికి కారణమైన ధర్మాన్ని కూడా అంగీకరించడు. దేవుడు జగత్తునకు కర్త అని, నియంత అనీ అంగీకరించడు. జగత్తు కేవలం విషయసుఖాలను అపేక్షించేందుకు రూపమైన కామాలచేత (కోరికల చేత) ప్రేరేపించబడినదని, స్త్రీ పురుష సంయోగం వలన ఉత్పన్నమైనదనీ భావిస్తాడు. ఈ జ్ఞానము మానవుడికి సత్యమైన ఆత్మప్రాప్తిని కలిగించదు. ఈ విపరీతజ్ఞానము వ్యర్థము.

చార్వాకమతానుయాయులైన నాస్తికులు విషయ పదార్థ భోగము చేత ఉద్భవించిన సుఖమే సత్యమని, బ్రహ్మసుఖము పుక్కిటి పురాణమనీ నమ్ముతారు. విషయసుఖాలచేత కోరికలను తీర్చుకోవడమే వారి ప్రధాన పురుషార్థము. ఈ అభిప్రాయంతో వారు వివిధ విలాసాలలో మునిగిపోతారు. అంతేకాదు, కొంతమంది విద్వాంసులు స్త్రీ పురుష సంయోగం చేత సృష్టి కలిగినట్లుగానే మాయా బ్రహ్మసంయోగం వలన జగత్తు పుట్టినదని చెబుతారు. కానీ స్వర్గనరకాలు, బంధమోక్షాలు, పుణ్యపాపాలు, పునర్జన్మ – వీటిని వారు నమ్మరు. ఇవి అన్నీ ఋషులు అదుపులో వుంచుకోడానికి వ్రాసినవని భావించి; తింటూ, త్రాగుతూ, విలాసాలను అనుభవిస్తూ – అవే సత్యాలని అంతరంగంలో విశ్వసిస్తారు. రకరకాల ఆశలను కలిగిస్తారు. వీరు ప్రచ్ఛన్న చార్వాకులు.

మోఘశా:- ఈ చార్వాకులకు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు (రసము అంటే రుచి, గంధము అంటే వాసన) అనబడే అయిదు విషయ పదార్థాల పట్ల ఆశ కలుగుతుంది. వీరు వందలకొద్దీ ఆశలనే పాశాలతో బంధింపబడి వుంటారు.

*శ్లో॥ ఆశాపాశశతైర్బద్ధాః*
*కామక్రోధ పరాయణాః l*
*ఈ హన్తే కామభోగార్థమ్*
*అన్యాయేనార్థ సంచయాన్ ll*

భావం : వందలకొద్దీ ఆశాపాశాలతో (ఆశలనే బంధనాలతో) కట్టబడి, కామ క్రోధ పరాయణులై విషయ భోగాల కోసం అన్యాయంగా ధనాన్ని సంపాదిస్తూ వుంటారు.

ఆశలు నిరుపయోగకరమైనవి. ఎందుకంటే విషయాలకు సంబంధించిన మాయాపూరితమైన సుఖాలు క్షణికాలు, భావనామాత్రాలే. ఎండమావుల లాంటివి. జింక ఎండమావిలోని నీటికోసం భ్రమించి పరుగెత్తి ఎంతో శ్రమించి, ఆ స్థలానికి చేరిన తరువాత నీరు కనిపించక నిరాశ చెంది తిరిగి వచ్చినట్లు అసుర ప్రకృతి కలవారు మాయామోహాలైన సుఖాలను కోరి విషయాలలోనే తిరుగుతుంటారు. కానీ అక్కడ తృప్తి కలుగదు. కాబట్టే భగవానుడు ఆశలు నిరర్థకాలని చెప్పాడు.

మోఘకర్మాణ : పైన వివరించిన నిరర్థకాలైన ఆశలచేత ప్రేరేపింపబడి చేసే కర్మలు నిరర్థకాలు. జనులు భోగవిలాసాలలో మాత్రమే నిమగ్నులౌతారు. అదే వారి ధ్యేయము. అందుకు ముఖ్యమైన సాధనం ధనము. కాబట్టి అన్యాయంగా, క్రూరత్వము మొ॥న తీవ్రమైన ప్రవర్తన ద్వారా ధనాన్ని సంపాదించాలనుకుంటారు.

శ్లో॥ ఏతా దృష్టిమవష్టభ్య
నష్టాత్మానోఽల్ప బుద్ధయః l
ప్రభవన్త్యుగ్రకర్మాణః
క్షయాయ జగతో ఽహితాః ll

భావం:- ఈ తలక్రిందు ఆలోచనలలో పడి శ్రేయస్కరం కాని పనులు చేసేవాడు, తీవ్రమైన ఉద్రేకపూరితమైన కర్మలు చేసేవారు, అల్పబుద్ధులు అయినవారు ఆత్మజ్ఞానం పొందలేనివారై ప్రపంచ వినాశనానికి కారకులౌతారు.

ఈ అసుర సిద్ధాంతాన్నే అవలంబించి బుద్ధిహీనుడు, “శరీరమే నేను, శరీరానికి అతీతంగా ఆత్మ అనేదే లేదు” అని భావించి ఎల్లప్పుడూ భోగలాలసుడౌతాడు. భోగానుభవం కోసం (విలాసాల కోసం) అన్యాయముగా – అంటే వ్యాపారంలో మోసము చేసి, ఉద్యోగంలో లంచం తీసుకుని, దొంగ సాక్ష్యాలు చెప్పి, దొంగవ్రాతలు సృష్టించి, ఇతరుల ఇల్లు, భూమి, ధనము మొ॥నవాటిని దొంగిలిస్తాడు. ఇతరుల ధనాన్ని అపహరించడమంటే వారి ప్రాణాలను తీయడమే.

శ్లో॥ విత్తమేవ మతం సూత్రే
ప్రాణాః బాహ్యాః శరీరిణామ్ l
తస్యాపహారమాత్రేణ
స్యుస్తే ప్రాగేవ ఘాతితాః ll

భావం: సూత్రాలలో (జైవ సూత్రాలలో) ధనమే శరీరాన్ని ధరించిన మానవులకు ప్రాణమని అంగీకరించబడి వున్నది. ధనాన్ని అపహరించడంలో వారి ప్రాణాలను తీయడమే జరుగుతుంది.

ఇది గృహస్థుల విషయంలో చెప్పబడింది.

ఇక సన్యాసుల విషయంలో వారి దంభాన్ని గ్రహించవచ్చు.

భగవద్గీత 16వ అధ్యాయంలో అసురసంపత్తిని వర్ణిస్తూ, ‘దంభోదర్పోఽభిమానశ్చ’ అని మొదట దంభాన్ని పేర్కొన్నారు.

ప్రభోధ చంద్రోదయంలో ఇలా వున్నది – మహామోహుడు, వివేకుడు అనే ఇద్దరు రాజులు వుండేవారు. కాశీలో వివేకుని పేరు ప్రతిష్ఠలు పెరుగుతూ వున్నాయి. అతడు ప్రతి తీర్థానికి శమదమాదులను పంపి ప్రబోధము చేస్తూవుండేవాడు. ఇది చూసి మహామోహుడు తన రోజులు దగ్గరపడ్డాయని భావించాడు. అప్పుడు అతడు దంభుడు, అహంకారుడు అనే సర్దారులను కాశీకి పంపాడు. దంభుడు వెళ్ళిన తరువాత అహంకారుడు నెమ్మదిగా తిరుగుతూ, తిరుగుతూ ఒక ఇంటిని చేరాడు. అక్కడ అగ్నిహోత్ర సామగ్రి కనిపించింది. హోమపు పొగ బయటికి వస్తున్నది.

ఈ ఇంటిలో ఒకటి రెండు రోజులు వుంటే బాగుంటుందని అహంకారుడు భావించాడు. ఆ ఇంటి ప్రాంగణంలో కొంచెం లోపలికి వెళ్ళాడు. అక్కడ దంభుడు శరీరమంతా గోపీచందనాన్ని, దర్భలను ధరించివున్నాడు. అతనిని చూసి అహంకారుడు ‘శుభమగుగాక!’ అని ఆశీర్వదించాడు. దంభుడు, “ఊ” అని ఆగాడు. ఇంతలో అతని శిష్యుడు ఇలా పలికాడు

“మహాత్మా! ఈ ఆశ్రమంలోకి కాళ్ళు కడుగుకొని ప్రవేశించాలి.”

అహం: ఇది చాలా దరిద్రదేశము. అతిథికి సత్కారము లేదు.

శిష్య : పూజ్యపాదుల ఆజ్ఞ. తమ జాతి మాకు తెలియదు.

అహం : మహాపవిత్రమైన నగరంలో మహాపవిత్రమైన వంశంలో జన్మించిన సర్వోత్తమమైన పవిత్రమైన పేరు గలవారు మా తండ్రిగారు.

శిష్య : తమరు పెద్దవారే అయినా కాళ్లు కడుగుకొని ప్రవేశించండి.

ఇక చేసేదేమీ లేక అహంకారుడు కాళ్లు కడుక్కొని ముందుకు నడిచాడు. అప్పుడు దంభుడు పళ్ళు పట పట కొరుకుతూ ఇలా అన్నాడు:

“దూరంగా నిలబడు. నీ శరీరాన్ని త్రాకిన చమట బిందువులు గాలికి నామీద పడుతున్నాయి, నన్ను అపవిత్రం చేస్తున్నాయి.”

అహం : ఎంత గొప్ప చమత్కారమైన ఆచారము!

శిష్య :- మహారాజులు కూడా మా పూజ్యపాదులైన గురువరేణ్యుల దర్శనానికి వస్తారు. వారు కూడ గురువరేణ్యుల పాదాలను త్రాకడానికి అనర్హులు. కాబట్టి వారి కిరీటాలను చేతిలో పెట్టుకుని వాటి మాణిక్యాల మెరుపుల కాంతుల కిరణాల ప్రకాశంతో సద్గురువుల చరణాలకు హారతిస్తారు.

**- సశేషం**

# మాతృదేవి స్మృతులు

శ్రీమతి పెద్దింటి విజయ, నాగోలు

ముందుగా నా జీవితంలో పూజ్యశ్రీ అమ్మగారి, పూజ్యశ్రీ మాస్టరుగారి పరిచయాన్ని కల్పించిన సమర్థ సద్గురు శ్రీ శిరిడి సాయినాథునికి నా హృదయపూర్వక నమస్సుమాంజలులు. ఆ పూజ్య గురుదంపతులకు శతసహస్రకోటి కృతజ్ఞతాపూర్వక పాదాభివందనములు.

2012 డిసెంబరులో నేను బి.టెక్. మూడోసంవత్సరం చదువుతున్నప్పుడు శ్రీ రామకృష్ణగారితో నా వివాహము జరిగినది. మా వివాహానికి ముందే మావారు నాగోల్(హైదరాబాదు) లో పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిలో ఉండేవారు. నాకు మావారి ద్వారానే పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలు పరిచయం అయినాయి. పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధి భాగ్యం లభించింది. మొదట్లో చాలా కొత్తగా అనిపించేది. తరవాత నెమ్మదిగా గ్రంథ పారాయణ చేయడం, సత్సంగాలలో పాల్గొనడం జరిగింది.

2013 ఫిబ్రవరి 9న మాస్టరుగారి బ్రహ్మానుభూతి మహోత్సవం రోజున నాకు మొదటిసారి అమ్మగారి దర్శనభాగ్యం కలిగింది. నాకు మొదట్లో అంత భక్తిశ్రద్ధలు ఏమీ ఉండేవి కావు. నా చదువు అనంతరం నేను 2014 మే లో పూర్తిగా నాగోలు రావడం జరిగింది. క్రమక్రమంగా నిలయంలో జరిగే సత్సంగంలో కూర్చొని వింటూ ఉండేదాన్ని. నిలయం సత్సంగం హాలులో పూజ్యశ్రీ అమ్మగారి దర్శనాలు, సత్సంగం కూడా జరిగేది. క్రమక్రమంగా నాకు సత్సంగాలు, భజనలు నచ్చడం మొదలు పెట్టాయి. తరువాత మెల్లమెల్లగా పూజ్యశ్రీ అమ్మగారి పట్ల, పూజ్యశ్రీ మాస్టరుగారి పట్ల ప్రేమ, భక్తిశ్రద్ధలు మొదలయ్యాయి.

పూజ్యశ్రీ అమ్మగారి ప్రేమ ఎంతటిదో మనమేం చెప్పగలము? కాలాంతరంలో నేను గర్భవతిని అయ్యాను. నాకు సీమంతం చేయించుకోవాలని ఉండేది. కానీ మా అత్తవారి ఇంట్లో ఆనవాయితీ లేదన్నారు. అందువలన పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిలో చేసుకోవాలని నాకు మనసులో బాగా కోరికగా వుండేది. పూజ్యశ్రీ అమ్మగారికి శ్రీమతి లయమ్మ గారి ద్వారా విషయం తెలియపరచుకున్నాము. పూజ్యశ్రీ అమ్మగారు దయతో అంగీకరించారు. ఈ విషయం విన్న మాకు ఎంతో ఆనందం కలిగింది. నేను శ్రీమతి లయమ్మ గారిని అడిగాను – "ఏమి చేసుకోమన్నారు, ఏమేమి సిద్ధం చేసుకోవాలి" అని. అప్పుడు శ్రీమతి లయమ్మ గారు "అక్కా, మీరు ఏమీ చేయనవసరం లేదు. అమ్మగారే అన్ని ఏర్పాట్లు చేస్తారు" అని చెప్పారు. ఈ విషయం విన్న మాకు నోట మాట రాలేదు. చెప్పలేనంత సంతోషం కలిగింది.

పూజ్యశ్రీ అమ్మగారే అన్ని ఏర్పాట్లూ చేయించారు. తన సొంత కూతురికి చేసినట్లే అన్నీ చేశారు. చీర, సారె, చలిమిడి ఇంకా అన్నీ పూజ్యశ్రీ అమ్మగారే నిలయంలో జరిపించారు. గురుకుటుంబం, గురుబంధువుల మధ్యలో ఈ వేడుక అద్భుతంగా జరిగింది. నాకు చెప్పలేని ఆనందము, సంతోషము కలిగాయి. అప్పట్లో పూజ్యశ్రీ అమ్మగారి ఆరోగ్యరీత్యా దర్శనం లేదు. కానీ ఆ రోజున నన్ను లోపలకు పిలిచి తమ దర్శనభాగ్యాన్ని ప్రసాదించారు. నాకు బొట్టు పెట్టి ఆశీర్వదించారు. నన్ను "పారాయణ

చేస్తున్నావా?" అని అడిగారు. నేను చేస్తున్నానని చెప్పాను. స్మరణలో గడపమని చెప్పారు. ఈ విధంగా పూజ్యశ్రీ అమ్మగారు నా మనసులోని కోరిక తీర్చి నా సీమంతం వేడుకలు ఎంతో చక్కగా జరిపించారు. ఇది మేము ఎప్పటికీ మరిచిపోలేని ఒక మధురానుభూతి. ఎప్పుడు ఈ వేడుక గుర్తువచ్చినా మనసంతా ఎంతో కృతజ్ఞతతో నిండిపోతుంది. ఇది కూడా పూజ్యశ్రీ అమ్మగారి అనుగ్రహమే. ఇంతటి ప్రేమను పంచిన 'అమ్మ' కు మా హృదయపూర్వక కృతజ్ఞతలు.

నాకు అక్టోబర్ 3, 2017న బాబు పుట్టాడు. మా బాబుకు నిలయంలో, పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిలో 'సాయి వందన్ (Sai Vandan)' అని నామకరణం జరిగింది.

నేను వచ్చిన ఇన్ని సంవత్సరాలలో పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిని సరిగా వినియోగించుకోలేదు అని నాకు అనిపిస్తుంది. అయితే పూజ్యశ్రీ అమ్మగారు నాగోల్ లో ఉన్న మా అందరి చేత ఎన్నో దీక్షలు చేయించారు. అమ్మగారి నుండి కొన్ని బోధలు కూడా తెలుసుకున్నాను.

పూజ్యశ్రీ అమ్మగారు గాంధీనగర్ లో ఉండేటప్పుడు ఒక దీక్ష ఇచ్చారు. అదేమిటంటే ఉదయం నుండి సాయంత్రం వరకు మన మనసులో అవతలి వారి పైన వచ్చే చెడు అభిప్రాయాల్ని గమనించి సరి చేసుకోవడం. ఈ దీక్ష చేస్తున్నప్పుడు 'ఏంటి మన మనసులో అవతలి వారి గురించి యిన్ని భావాలు వస్తాయా!' అని అనిపించింది. నేను పాల్గొన్న మొదటి దీక్ష ఇది.

పూజ్యశ్రీ అమ్మగారు చేసిన బోధనలో ఇంకొకటి ఆత్మ విమర్శ చేసుకోవడం. మనం ఉదయం నుండి రాత్రి నిద్రపోయే వరకు ఎలాంటి ఆలోచనలు వచ్చాయని చూసుకోవడం, మన మనసులో అవతలి వారి పట్ల ఎలాంటి భావాలు వస్తున్నాయో చూసుకోవడం, తిరిగి వాటిని సరిచేసుకోవాలనే వారు.

నిస్వార్థ సేవ గురించి కూడా పూజ్యశ్రీ అమ్మగారు చెప్పేవారు. మనం ఎదుటివారికి ఎంత ఉపయోగ పడుతున్నాము అని ఆలోచించమని అనేవారు. మంచి విషయాలు ఎదుటివారికి పంచడం కూడా సేవ అని చెప్పేవారు. ఇంటిలో చేసుకునే చిన్న చిన్న పనుల దగ్గరనుండి ఇంటిలోని వారితో మనం ఎలా ప్రవర్తించాలి, ఎంత ప్రేమగా ఉండాలో చెప్పేవారు. మనకు వీలైనంత ఎదుటివారికి సహాయపడాలని చెప్పేవారు. ప్రతి విషయానికి కృతజ్ఞత కలిగి ఉండాలనే వారు. మా నాగోల్ సత్సంగ బృందానికి ఎప్పుడూ కలిసి ఉండాలని చెప్పేవారు. అలా మేము కలిసి ఇక్కడ ఇన్ని పూజ్యశ్రీ మాస్టరుగారి వేడుకలు, పండుగలు చేసుకున్నామంటే అది పూజ్యశ్రీ అమ్మగారి కరుణే.

ఈ కరోనా సమయంలో కూడా మేమందరమూ online సత్సంగం చేసుకున్నాము అంటే అది కూడా అమ్మగారి అనుగ్రహమే. ఈ అధ్యయన కార్యక్రమం జరుగుతున్నప్పుడు కూడా పూజ్యశ్రీ అమ్మగారు మాకు online దర్శనాలు ఇచ్చేవారు. అధ్యయనం ఎలా జరుగుతుంది, ఏమి అవగాహన అవుతుంది అని అడిగేవారు. సత్సంగం కూడా చేసేవారు. ఎప్పటికప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారి మార్గంలో ఎలా నడవాలి, ఆయనకు నచ్చినట్లు మనం ఎలా ఉండాలి అని చెప్తూ ఉండేవారు.

ఒక విధంగా మా అందరినీ పూజ్యశ్రీ అమ్మగారు ఎప్పటికప్పుడు మా తప్పులు దిద్దుతూ, మా ఆలోచనలు సరిచేస్తూ నడిపించారని నాకు అనిపిస్తుంది.

నాకు కొంచెం జీవితం పట్ల అవగాహన, మన ఆలోచనలో మార్పులు, మన భావాలను సరిచేసుకోవడం, అందరిపట్ల వీలైనంత సహృదయత కలిగి ఉండడం, సాటివారికి తోడ్పడటం, మంచి విషయాలను అందరితో పంచుకోవడం, మార్పు మన నుంచి మొదలవడం. ఇవన్నీ కొంచమైనా గుర్తించగలగడం, గుర్తించి వాటిని కొంచెమైనా ఆచరణలో పెట్టగలుగుతున్నాను అంటే ఇదంతా అమ్మగారి కరుణే! వారి అనుగ్రహమే!

మా కుటుంబం అంతా పూజ్యశ్రీ అమ్మగారికి మాస్టరుగారికి నచ్చినట్లు జీవించాలని, అటువంటి శక్తిని సామర్థ్యాన్ని ప్రసాదించమని ప్రార్థిస్తూ, జన్మజన్మలకు మమ్మల్ని చేయిపట్టి వారి మార్గంలో నడిపించమని కోరుతూ గురుదంపతులకు సహస్ర కోటి కృతజ్ఞతలు పూర్వక పాదాభి వందనములు తెలుపుకుంటున్నాను.

జై సాయి మాస్టర్!

(గత సంచిక తరువాయి)

# ప్రేమ స్వరూపుడు

శ్రీ కె. ఎస్.ప్రసాద్

*(అతి చిన్న వయస్సులో మాస్టరుగారి దరిచేరి వారి ప్రేమను పొంది, వారి జీవితంలోని ప్రతి అంశాన్ని కుతూహలంతో క్షుణ్ణంగా పరిశీలించి వారి ఆచరణా పాటవానికి ప్రభావితుడై ఆధ్యాత్మిక బాటలో బాటసారియై తన లక్ష్యము వైపు పురోగమిస్తున్న వీరు ఉత్సాహంగా, విపులంగా మాస్టరుగారి జీవిత ఘట్టాలను మనకందిస్తూ సాయిమాస్టర్ సన్నిధికి తీసుకెళ్తున్నారు.)*

ఒకసారి సత్సంగం అయ్యాక నేను, దామూ ఇంకొందరు కూర్చుని వున్నాము. దూరప్రాంతాల నుంచి ఎవరో మాస్టరుగారి దర్శనానికి వచ్చి బాబా దగ్గర టెంకాయ పెట్టి, గురువుగారికి నమస్కరించి, వారు దూరంగా కూర్చున్నారు. మాస్టరుగారు పడుకుని కాళ్ళ మీద కాలు వేసుకుని ఏదో పుస్తకం చదువుతున్నారు. నేను వారికి దగ్గరగా వున్నాను. నా వెనుక దామూ కూర్చుని వున్నాడు. మాస్టరుగారు పుస్తకం చదువుతూనే "ఒరేయ్ టెంకాయ కొట్టు" అన్నారు. అనంగానే నేను టెంకాయ కొట్టాను. వెనుకనున్న దామూ ఏడుస్తున్నాడు. కొద్దిసేపైన తర్వాత మాస్టరుగారు "ఏమిటి విశేషం" అన్నారు నవ్వుతూ! "నన్ను మీరు టెంకాయ కొట్టమంటే ప్రసాద్ టెంకాయ కొట్టాడు సార్! మీరు నాకు చెప్పిన సేవ చేయలేకపోయాను గదా! ఎలా సార్!" అంటూ బాధపడ్డాడు. దానికి మాస్టరుగారు "ఒరే, నీవెప్పుడూ ఇక్కడ వుండేవాడివే గదా! వాడెప్పుడో వస్తాడు. వచ్చినప్పుడు ఏదో ఒక బాబా సేవ చేయాలని వుంటుంది! దానికింత ఇదైతే ఎలా!" అన్నారు.

గురువారం సత్సంగంలో ఒకసారి మిలారేపా చరిత్రను మాస్టరుగారు చాలా ఇంట్రస్టుగా చదువుతున్నారు. నేను మెట్టు నుంచి బయలుదేరి పాలు, పూలు, కాయగూరలు తీసుకొని విద్యానగర్ వచ్చేసరికి సత్సంగం మొదలై చాలా సేపయ్యింది. నేను దూరం నుంచే నమస్కరించి, దొంగలా, నెమ్మదిగా మాస్టరుగారికి తెలియకుండా, చప్పుడు చేయకుండా కూర్చున్నాను. మిలారేపా టిబెట్టులోని కొండ గుహలలో తీవ్ర సాధన చేసిన ఘట్టం గూర్చి వివరిస్తున్నారు. మధ్యలో పుస్తకం ప్రక్కన పెట్టి నా వైపు చూస్తూ, "మిలారేపా చీట్లపేక ఆడలా. తీవ్ర సాధనకెలా జీవితాన్ని అంకితం చేసాడో చూచావా? ఏ మార్గం ఎన్నుకుంటే, ఆ మార్గంలో ప్రయాణించాలి! అంతేగాని రెండు పడవలలో కాళ్ళు పెడితే రెంటికి చెడ్డరేవడవుతారు" అని మరలా పుస్తకంలోని విషయాలు వివరించారు మాస్టరుగారు. నేను వంచిన తల ఎత్తనే

లేదు! ఆ మాటలు నన్ను గురించే అన్పించింది. ఆ రోజు మధ్యాహ్నం నేను, మరి కొందరు స్నేహితులతో కలసి చీట్లపేక ఆడాను. టైం కూడా తెలియలేదు! అందుకే సత్సంగానికి రావడం లేట్ అయ్యింది. మాస్టరుగారికి ఆ రోజు నేను చేసిన పనులన్ని తెలిసి, నా సాధన గురించి వారు హెచ్చరిక చేసినా మరలా దున్నపోతు మీద వాన కురిసినట్లే అయ్యింది. ఆ రోజు వారి కళ్ళలోకి సూటిగా చూడలేకపోయాను.

మాస్టరుగారంటే అభిమానం, భక్తి, ప్రేమ, గౌరవం వుండేవి. కాని బాబా అంటే మొదట్లో ఏమీ వుండేది కాదు! కాని ప్రతి గురువారం భజనకు తప్పకుండా రావల్సిందే. ఒక గురువారం ప్రసాదం వినియోగం అయిన తర్వాత నేను మౌనంగా వున్నాను. అప్పుడు మాస్టరుగారు "రాత్రికి ఇక్కడే పడుకుంటావా?" అన్నారు. అక్కడ ఇంకా చాలామంది పడుకుంటారు అనుకుని "నేను పడుకుంటాను సార్" అన్నాను. మాస్టరుగారు లోపలికి వెళ్ళినారు. తర్వాత ఒక్కొక్కరే వాళ్ళ వాళ్ళ ఇళ్ళకు వెళ్ళిపోయారు. రూమ్ లో నేనొక్కడినే వున్నాను. అరగంట తర్వాత మాస్టరుగారు ప్లేటులో దోసెలు, ఒక కప్పులో పాయసం నాముందుంచి, నన్ను తినమని చెప్పి లోపలికి వెళ్ళారు. నాకు చాలా మొహమాటం! అందువల్ల 'గమ్ముగా' తలవూపాను. నేను నెమ్మదిగా తినడం పూర్తి చేసి, కొద్దిసేపటి తర్వాత పడుకున్నా గాని, నాకు నిద్ర రాలేదు. ఒకటే ఆలోచనలు, ఏవేవో దుష్ట తలంపులు. నాకు భయమేసింది! మాస్టరుగారి రూములో ఇలాంటి ఆలోచనలు రావడం ఏమిటి? నాకేమైనా అవుతుందా? పాపం చుట్టుకుంటుందా! ఏమి అర్థంగావటంలేదు! కళ్ళు తెరచి చూశాను. ఎప్పుడొచ్చి పడుకున్నారో గాని, మాస్టరుగారు నాకు కొద్ది దూరంలో పడమరవైపు ముఖం పెట్టి ఎర్ర లుంగీతో పడుకుని వున్నారు. నాకు కాస్తంత ధైర్యం వచ్చింది. మరలా నిద్రకు ఉపక్రమించాను. మరలా ఏవేవో ఆలోచనలతో భావాలతో నా మనస్సంతా నిండి చాలా భారంగా తోచింది! నిద్రే లేదు రాత్రంతా! ఎప్పుడు తెల్లవారుతుందా? ఎప్పుడు ఇంటికెళ్తామా? అని ఎదురుచూచి, తెల్లవారగానే మాస్టరుగారి దగ్గర సెలవు తీసుకుని ఇంటికి వెళ్ళాను.

మాస్టరుగారు ఒకరోజు కొన్ని పుస్తకాలు నా చేతికి ఇచ్చి వాటిని బీరువాలో పెట్టమన్నారు. వాటిని సర్దుతూ వున్నప్పుడు బీరువాలో ఒక తెలుగు పుస్తకంలో ప్రాణాయామం గురించి వుంటే దాన్ని చదివి మరురోజు నుంచి ఇంటి దగ్గర చేయడం మొదలు పెట్టాను. సత్సంగమైన తరువాత కొద్ది సేపు ధ్యానం చేయించేవారు ప్రతిరోజూ! ఒకరోజు నేను నమస్కరిస్తూ వుంటే, "ఏమిరా? ప్రాణాయామం చేస్తున్నావా ఏమిటి? పుస్తకాలు చదివి అలాంటివి చేయకూడదు. అవి చేయాలంటే ఆ సాధన చేసి తరించిన వారి వద్ద నుంచే నేర్చుకోవాలి. లేకుంటే ఆహార నియమాలు, మధ్యలో వచ్చే అవాంతరాలకు విరుగుడు తెలియక తికమకపడి ఆరోగ్యం దెబ్బతిని పిచ్చిపట్టే ప్రమాదముంది" అన్నారు. "అయితే ఏమి చేయమంటారు సార్?" అన్నాను. నావైపు ప్రేమగా చూసి "నీవు 'సోహం' చెయ్యి చాలు. ఎలా అంటే శ్వాస పీల్చేటప్పుడు 'సో' అని వదిలేటప్పుడు 'హం' అని అంటే చాలు. కాని దానిని శ్వాసతో కలిపి చేయటం సహజంగా అయితే చాలు" అన్నారు. నేను కొద్ది సేపు వారి ఎదుటే ప్రాక్టీస్ చేశాను. శ్వాసలో సోహం కలపటం నాకు ఎంతో కష్టమై దానితో వేగలేక (జపంలాగ చేస్తే కూడా కుదరలా) వదిలేసి మాస్టరుగారికి నమస్కారం చేసుకొని మెట్టుకు బయలుదేరిపోయాను. ఇంటికి పోయి భోజనం చేసి దుప్పటి కప్పుకోబోయాను, అప్పుడు నా చెవులకు "సోహం" అని విన్పించింది. ఆశ్చర్యపోయాను. నేను వింటూ వుంటే నేను శ్వాసపీల్చటం, వదలటం మొత్తం కలిసి "సోహం" అని నాకే విన్పిస్తూంది. ఎంత గొప్ప విషయం. అలా చాలా సేపు విని నిద్రపోయాను. మధ్య మెలుకువ వచ్చింది. మెలకువతోటే 'సోహం' విన్పించటంతో నాకు భయం వేసింది. ఆ తర్వాత నిద్రపట్టలేదు. తెల్లవార్లు "సోహం" అనే విన్పిస్తూనే వుంది.

తెల్లవారగానే ముఖం కడుక్కొని నేరుగా విద్యానగర్ కెళ్ళి మాస్టరుగారికి నమస్కరించాను. అప్పుడు సమయం ఉదయం 7గంIIలు. కాలేజీకి బయలుదేరుతూ వున్నారు. నాకు విభూది పెట్టి "ఏమిటి విశేషం, ఇప్పుడొచ్చావు" అన్నారు. నాకు జరిగిన అనుభవం చెప్పి "నాకు రాత్రి చాలా భయం వేసింది సార్" అన్నాను. ముఖం అదోలా పెట్టి "ఆ" అన్నారు. "కాలేజీకి టైం అయ్యింది. పోతూ మాట్లాడుదాం రా!" అని లేచి దారి పొడుగునా మా వూరిలో వారు బాగున్నారా? వీరు బాగున్నారా అని, "అందరినీ అడిగానని చెప్పు" అంటూ కాలేజీలోని స్టాఫ్ రూములోకి వెళ్ళారు. నేను మా వూరి దారి పట్టాను. ఒక మైలు దూరం నడిచిన తర్వాత

గుర్తు వచ్చింది నేనెందుకు వచ్చానో, వారేమీ చెప్పలేదే అనుకుంటూ శ్వాసను గమనించా? చిత్రం 'సోహం' అని విన్పించలా! ఎప్పుడు ఆగిపోయిందో? ఏమో? వారికి చెప్పటం వరకే మన వంతు. అంతా వారే చూస్తానన్న, బాబా మాటలెంత సత్యమో అన్పించింది! 'సోహం' అనే స్థితి ఎంత గొప్పదో మాస్టరుగారి సమాధి అనంతరం నేను ఒక గ్రంథంలో చదవటం జరిగింది! ఎంత గొప్ప స్థితిని మాటమాత్రాన ఇవ్వటం! తీసుకోవటం! వారికి నా పై ఎంత కరుణా అని!

విద్యానగర్ లో ఎంతో ప్రేమగా మమ్ములందరినీ చూచేవారు. ఆ ప్రేమ పూర్వకమైన పిలుపు, ఆ గొంతులో వాత్సల్యంతో కూడిన లాలిత్యానికి నా మనస్సు కరిగిపొయ్యేది వారి సన్నిధిలో! నిష్కల్మషమైనది వారి అంతరంగం. సాటివారి మేలు కొరకు విధి, విరామం లేకుండా పాటుపడేవారు! నా మేలు కొరకు నేనుకూడా అంత శ్రద్ధ తీసుకోను. కాని నా గురించి ఎన్నో కోణాల నుంచి నాకేది మేలు చేస్తుందా అని వారు ఆలోచించేవారు.

ప్రతి గురువారం సత్సంగం అయిన తర్వాత కూడా తనను దర్శించడానికి వచ్చిన వారితో చాలా సేపు మాట్లాడుతూనే వుండేవారు. నాకు నిద్రతూగితే "నీవు పడుకోరా" అనేవారు. సామాన్యంగా మాస్టరుగారు ఆసనం మీద కూర్చుని వున్నప్పుడెప్పుడూ నేను హాలులో పడుకోలేదు.

అందరినీ సాయికృపకు పాత్రులయ్యేటట్లు చేయడమే వారి కర్తవ్యంగా, సాయి సేవగా భావించి తన చెంతకొచ్చిన ప్రతివారికీ సాయి లీలలను ప్రతిసారీ క్రొత్తగా చెప్పినట్లు చెప్పేవారు. ఆనందం, సంతృప్తి వారి ముఖంలో కొట్టొచ్చినట్లు కన్పించేది.

ప్రపంచంలో ఎన్ని రకాల ఆధ్యాత్మిక సాధనా మార్గాలున్నాయో వానినన్నింటినీ ఎంతో ఓర్పుగా, నేర్పుగా అవసరమైనప్పుడు మాత్రమే ఎదుటి వ్యక్తి తెలియపరచేవారు తప్ప, "నాకన్నీ తెలుసన్నట్లు వుండేది కాదు" వారి వైఖరి. చిన్న పిల్లలు సైతం మామూలుగానే వారిని ప్రశ్నించేవారు. ఏ బెరుకూ వుండేది కాదు! అంత ప్రేమగా, చనువుగా వుండేవారు. అంతేగాని నేను కాలేజీ లెక్చరర్ ననో, ఐ.ఎ.ఎస్. ననో, మందిర ప్రెసిడెంటుననో, రచయితననో, ఎన్నో అనుభవాలు పొందినవాడిననో, ఎందరో మహాత్ముల ఆశీస్సులు పొందినవాడిననో, నాకందరూ తెలుసనే గర్వం, అహంకారం, దర్పం, దంబం, వారి మాటలలోగాని, చర్యలలోగాని ఎదుటవారికి తెలిసేది కాదు. అందరిలోను వారికి బాబానే కన్పించేవారు. "పండితాః సమదర్శనః" అన్నదానికి పర్యాయపదమే వారి దివ్యచేతనరూపం.

వేసవికాలంలో మాస్టరుగారితో కలిసి బావులలో ఈత కొట్టటం మహాసరదా! బావిలో మాస్టరుగారు అందరితో కలిసి ఈత కొట్టేవాళ్ళు చాలా సేపు. ఒక్కొక్కసారి మాస్టరుగారు "మీరు వుండండి, నేను వెళతాను" అని వచ్చేసేవారు. ఎవరో ఒకరు వారితో కలిసి రూముకెళ్ళేవారు. మిగిలిన వారమంతా అలసిపోయే వరకు దూకటం, ఈదటం చేసి సత్సంగం టైముకి హాజరయ్యేవారం. భాస్కర్ వాళ్ళ తోటలో ఒక బావి, పొలాల్లో రెండు బావులుండేవి. వాటిలో ఈతకొట్టేవారు. ఒకసారి భాస్కరు, మూర్తి, నేను, విజయ్ కుమార్, ప్రకాశరావుగారు ఇంకా కొందరూ కలిసి బంగళా దగ్గర బావిలోకి ఈతకెళ్ళినాము. అప్పుడు మాస్టరుగారు "ప్రకాశరావ్! లోపలికి రండి, నేను వున్నాగా ఎలా ఈదాలో చెపుతా " అంటే, "నాకు ఈత రాదు సార్! నేను బయటే మెట్లపై స్నానం చేస్తానని" ఎంత చెప్పినా వచ్చేవారు కాదు!

విద్యానగర్ పోస్ట్-మాస్టరు కుమార్తె పెండ్లికి గురువారం రాత్రి మాస్టరుగారు, సత్సంగ సభ్యులం అందరం కలిసి వెళ్ళాము. గురువారం రాత్రి మాలో ఎక్కువ మంది భోజనం చేసేవారు కాదు. కొద్దోగొప్పో పలహారం చేసేవారం. మాకందరకూ మాస్టరుగారితో సహా భోజనం వడ్డించారు. అప్పుడు మేమంతా మాస్టరుగారి వంకా, పోస్ట్-మాన్ వంకా చూశాము, ఏమిటి ఇలా చేసారన్నట్లు, మాస్టరుగారు "ఏం పర్వాలేదులే! మీ దుంపతెగ తినండోయ్" అని పోస్ట్ మాన్ కి మనస్తాపం కలుగకుండా కాపాడారు. దారిలో వస్తూ "ఒక పూటకు తింటే నియమభంగం కాదు", జిహ్వాచాపల్యం వల్ల నియమం, ఉల్లంఘించకూడదు గాని, ఇలాంటప్పుడు మాత్రం గొప్పగా "మేం ఉపవాసమండి" అంటూనే, "భేషజాలకి పోయి, ఇతరుల హృదయాలను గాయపరచకూడదు. ఏ నియమమైనా ఇతరుల మనస్సులకు, పనులకు, భావనలకు ఇబ్బంది పెట్టేదిగా వుండరాదు. అలా అని నియమాలకు తిలోదకాలు ఇవ్వకూడదోయ్" అంటూ తోక కత్తిరించారు. ఏ విషయమైనా ఏ ఒక్కరినీ వుద్దేశించకుండా చెప్పేవారు.

ఒక గురువారం నేను మెట్టు నుంచి సత్సంగానికి బయలుదేరే దారిలో ఒకచోట తెలిసిన వాళ్లు కనిపిస్తే జోకులు వేసుకున్నాం. ఆ సంభాషణలో చాలా ఇంట్రస్ట్ గా ఇన్వాల్వ్ అయ్యింది నా మనసు. ఆ వూపులోనే సత్సంగంలోకి ప్రవేశించాను. ఆ రోజు అన్నారీ మాటలు "ఏమిటో కొందరు ఒళ్ళు తెలియకుండా ఏదోదో మాట్లాడుతారు. మహాత్ముల గూర్చి కూడా జోక్ వేస్తుంటారు. అలా చేస్తే భావం దెబ్బతిని పతనమౌతారని గుర్తించరు. మళ్ళీ మేము సాధనకే అంకితం అని పెద్ద ఫోజ్ పెడుతుంటారు. అలాంటి జోకులు ఎట్టి పరిస్థితుల్లోను వేయకూడదు. మన భావం మనకే చులకనై పోతుంది. భావం దెబ్బతినకుండా చూచుకోవాలి మరి" అన్నారు. నా ప్రవర్తన గురించే అన్నారని, అది నాకు నేరుగా చెబితే నేనెక్కడ బాధపడతానోనని, ప్రేమతో ఎవరితోనో చెబుతున్నట్టు చెప్పారు. నన్ను ఏమారక గమనిస్తూ సూచనలిస్తున్నారని తెలిసి మరింత దగ్గరైనాను, శరణు పొందాను. ప్రతి చిన్న విషయంలో కూడా నన్ను, నా సాటివారిని సున్నితంగా సరిదిద్దే వారి నేర్పు, మా సాధన పట్ల వారికి గల శ్రద్ధ తలచుకుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తుంది. "పిల్లల పట్ల శ్రద్ధ తీసుకోని తల్లి తండ్రులున్న ఈ లోకంలో ఇతరుల గురించి పాటుపడేదెవరు". చిన్న పని చేస్తే అందువల్ల నాకేంటి లాభం? అని చూచే లోకం మరి. ఎవరి నుంచీ ఒక పైసా, కొద్దిపాటి శ్రమను కూడా పొందేవారు కాదు మాస్టరుగారు. అందరికీ అంతలా శిక్షణ యిస్తూ, వారి కొరకు తన కాలాన్ని వెచ్చిస్తూ కూడా సాయిచరిత్ర వ్రాశారు.

మొదట 'సాయినాథ పూజ' శ్లోకాలకు, నామాలకు అర్థం, వివరణ తెలియక పూజ చేసేటప్పుడు నాకు చాలా బోరుగా, ఇబ్బందిగా వుండేది. ఒకరోజు రాత్రి సత్సంగం తర్వాత మాస్టరుగారు చాలా ప్రశాంతంగా వున్నారు. ఆ సమయంలో నేను "సార్, పూజ చేస్తుంటే అర్థం తెలియక భావం నిలవటం లేదు. నాకు తెలుగు పదాలకే అర్థం తెలియదు. ఇక సంస్కృత భాషలోని ఆ శ్లోకాలెలా తెలుస్తాయి" అన్నాను. పడుకొని వున్న మాస్టరుగారు ఒక్క ఉదుటున లేచి కూర్చుని, "ఒరే! పేపరు, పెన్ను తీసుకో" అంటూ "సహస్ర శీర్షా పురుష : " (అనేక శిరములు, అనేక నేత్రములు , అనేక పాదములు ...........) అంటూ వివరణ ఇచ్చారు. రాత్రి భోజన సమయం దాకా. "ఆ తర్వాత వ్రాయవచ్చు. ముందు నీవు పోయి భోంచేసిరా, మెస్ మూసేస్తారేమో. తర్వాత మిగిలిన దానికి చెప్తా" నంటూ ఆసనం మీద నుంచి పంచె చేత్తో పట్టుకొని పైకి లేచి చేతిలో కొన్ని పేపర్లు, వాటి పైన సిగెరెట్టు పెట్టెలు పట్టుకుని వున్నారు. నేను వారికి నమస్కరిస్తే , వారు వంగి నా వీపున చేయివేసిన క్షణంలో నా శరీరమంతా విద్యుత్తు ప్రవహించినట్టయి చాలాసేపు అలాగే వుంటే, మరలా చేయి వేసారు. ఈసారి 'త్వరగా లే' అన్నట్టనిపించి వెంటనే లేచాను. తర్వాత దామూ నమస్కరించాడు. వారు మందహాసం చేస్తూ ఇంట్లోకి వెళ్ళారు. నేను చాలా సేపటికి సత్సంగం హాలులో నుంచి సెంటరుకి వెళ్ళితే అక్కడ ఒకే చిన్న బీడీ బంకు తప్ప మిగతావన్నీ మూసేసి వున్నాయి. నాకు ఆకలి తెలియట్లేదు. అప్పుడక్కడ ఒకే ఒక స్వీట్ స్టాల్ పరమేశ్వరన్ అనే వ్యక్తి నడిపే వాడు. నేను అతనిని నిద్రలేపితే "ఏమీ లేవండీ, రెండు లడ్లు మాత్రమే వున్నాయ"న్నాడు. 'సరే యివ్వు' అని అదే మహాప్రసాదమని తిని వచ్చేటప్పటికి వారు ఆసనంపై కూర్చుని నాకోసం ఎదురుచూస్తున్నారు. నాకెంతో సిగ్గేసింది. నాకోసం వారు నిరీక్షించటం చూచి. గబుక్కున తలవంచుకుని లోనికి వెళ్ళి పేపరు, పెన్ను తీసుకొని వారి ముందు కూర్చున్నాను. "ఆ.. ప్రారంభిద్దామా? నేనెక్కడిదాకా చెప్పాను?" అని అన్నారు. నేను చెప్పాను. తర్వాత నాకు నిద్ర తూగేంత సేపూ చెపుతూనే వున్నారు. నా నిద్ర చూచి "ఇంక పడుకో, రేపు చూద్దాము" అంటూ, "ఇందాక ఎందుకంత లేటయ్యింది?" అన్నారు. "మెస్ మూసేసి వుంటే కొన్ని షాపులు తిరిగి, నిద్రలేపి లడ్లు తిన్నాను, అలా తిరగటం వల్ల లేటయ్యింది" అన్నాను. ఇంట్లోకి వెళ్ళేందుకు నిలుచుంటే నేను నమస్కరిస్తే, విభూతి చేతిలో పెట్టారు. నేను మరికొందరు ఆ రూంలోనే పడుకున్నాము. కొద్ది సేపటి తర్వాత "ఒరేయ్ ఇవి తిను" అంటూ బిస్కెట్ల ప్యాకెట్ నా ముందుకు విసిరేసారు. మాస్టరుగారు రూంలోకి రావటంతో ఎగిరిలేచాం. అప్పటికే వారు లోనికి వెళ్ళారు. ఆ రోజు మరలా వారి దర్శనం లభించినందుకు అందరం సంతోషించాము. నాకు భోజనం దొరకనందుకు చాలా సంతోషించాను. నేను భోంచేసి వచ్చుంటే నాకు వారి ప్రసాదము, దర్శనం దొరికేవికావుగా! మనమెంత గింజుకున్నా బాబా మనకేది మంచిదో అదే చేస్తారు అని అన్పించింది.

**- సశేషం**

# బయ్యాజీ అప్పాజీ పాటిల్

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

ఈ యుగంలో మహాత్ములందరికీ తలమానికమనదగిన సాయిబాబా మానవాకృతితో శిరిడీలో అవతరించడమే మహాభాగ్యం. ఆ కాలంలో జీవించి, ఆయనను ప్రత్యక్షంగా దర్శించి, సేవించిన వారి భాగ్యమింకా ఎక్కువ. అంతకంటె గూడ శిరిడీలోనే పుట్టి పెరిగి ఆయన సమకాలికులుగా జీవిస్తూ ఆయనను సేవించుకొనగల్గడం యింకెంతో అదృష్టం. కారణం అనాదిగా తమవాళ్ళందరూ ఆ గ్రామంలో జీవిస్తున్నారని, అందుకే తాము మరల శిరిడీలో ప్రకటమయ్యామనీ భక్తులతో శ్రీసాయి చెప్పిన వివరం హరివినాయక్ సాతే వ్రాశాడు. సాయికి అంతటి ప్రీతిపాత్రులైన 'స్వజనుల' లో ఒక్కడయ్యే అదృష్టం శిరిడీ వాస్తవ్యుడైన బయ్యాజీ అప్పాజీ పాటిల్ కు గూడ లభించింది. అలాటివారిలో గూడ అతనికి ఎంతో అరుదైన సదవకాశం మరొకటి లభించింది. సుమారు ఆరు దశాబ్దాలపాటు అహర్నిశలూ తమ పాంచభౌతిక శరీరం ద్వారా తమ అవతారకార్యం కొనసాగించిన సాయి తమ శరీరాన్ని విడిచే సమయంలో మాత్రం భక్తులలో ఎక్కువమందిని భోజనాలు చేయమని యిండ్లకు పంపివేశారు. ఎప్పుడూ నీడవలె ఆయన వెంటనుండి సేవించే అబ్దుల్లాగూడ సరిగా సమయానికి మశీదులో లేకుండా పోయాడు. బాబా కబురు చేసినా వెంటనే రాలేకపోయాడు. అటువంటిది బయ్యాజీ అప్పాజీ పాటిల్ సరిగా ఆ సమయానికి బాబా చెంతనే వున్నాడు. అంతేగాదు, అతనిపై ఒరిగే ఆయన తమ చివరి శ్వాస విడిచారు. అతడు తన స్మృతులనిలా చెప్పాడు:

"నా పసితనంనుండి నేను బాబాను ఎరుగుదును. బాబా తమ జీవితాంతము భిక్ష చేసుకున్న కొద్ది యిళ్ళలో మాది ఒకటి. సుమారు 3 సం॥లపాటు బాబా మాయింటికి భిక్షకు రోజుకు 8సార్లుగూడ వచ్చారు. తర్వాత 3 సం॥ల పాటు రోజుకు 4 సార్లు వచ్చారు. ఆ తర్వాత 12 సం॥లు రోజుకొక్కసారి మాత్రమే వచ్చారు. నా 11వ సం॥ నుండీ బాబాను సేవిస్తుండేవాడిని.

నా ఏడవయేట అనగా 1896లో రామనవమి – ఉరుసు ఉత్సవం ప్రారంభమైంది. అప్పటినుండే బాబా హిందువులను తమకు చందనమద్ది పూజ చేసుకోనిచ్చారు. ముస్లిములను మసీదులో తమ ఎదుట ఖురాను చదువుకోనిచ్చారు. హిందువులు బాబాకు చందన మద్దినపుడు, ఆయన మశీదు గోడలమీద చందనంతో తమ చేతి అచ్చులు వేసేవారు. అప్పుడు ముస్లిములు గూడ అలానే చేసేవారు. తర్వాత మహల్సాపతి నుదుట, మరికొందరు ముస్లిములకూ చందనమద్దేవారు బాబా. మహల్సాపతి బాబా నుదుట చందనం రాసేవాడు. అపుడు ముస్లిములను నమాజు చేసికొమ్మని చెప్పి, ఆ సమయంలో మిగిలిన అందరినీ నిశ్శబ్దంగా వుండమనేవారు బాబా. భక్తులు పాలకోవా మొ॥న నైవేద్యాలు తెచ్చినపుడు ఒక్కొక్కసారి బాబా స్వయంగా ఫాతిహా చేసి, ఆ ప్రసాదం హిందువులకు, ముస్లిములకు గూడ పంచేవారు. ఉరుసు ఉత్సవం జరుపుకునే పద్ధతులలో హిందువులు, ముస్లిములు వేరువేరు పద్ధతుల నవలంబించేవారు. కనుక బాబా అందరికీ సమానంగా, తమ చేత్తో చందనమద్దేవారు.

నా 11వయేట ఒకరోజు ఉదయం గం.9-30ని॥ల ప్రాంతంలో బాబా నన్ను పశువులు మేపుకోడానికి వెళ్ళనివ్వలేదు. ఆయన అకస్మాత్తుగా కోపించి, నన్నూ, మరికొందరినీ తిట్టి, నాలుగు కుండలు పగుల గొట్టారు. తర్వాత తమ అరచేతి వెనుక వైపున 'భం, భం' అని నోటితో శబ్దంచేసి, ఎవరి మరణమో అశుభమోగాని సూచించారు. నాటిరాత్రి మా మేనత్త కొడుకు దాజీకోటే (వయస్సు 30 సం॥లు) జ్వరంతో మరణించాడు.

బాబా తమ జీవితంలో చివరి 14 సం॥లపాటు నాకు నిత్యమూ నాలుగు రూపాయలిచ్చారు. వారి మహాసమాధి రోజునగూడ యిచ్చారు. ఆయన తామిచ్చే డబ్బు ఎవరికీ దానంగాగానీ, అరువుగాగానీ యివ్వవద్దని ఒకసారి చెప్పారు. 'దీనిని తిని ఏరగవద్దు, ఎవరికీ యిచ్చివేయనూ వద్దు' అన్నారు. కనుక నేను బాబా యిచ్చిన డబ్బుతో 84 ఎకరాల భూమిని కొన్నాను. అప్పటికే నాకు పది, పన్నెండు ఎకరాల భూమి వుంది. ఒకప్పుడు నేను గూడ అందరిలాగే చెఱకు పంట వేయాలని ఆశపడ్డానుగాని, బాబా వారించారు. ఒక్కసారి మాత్రం నేను ఆశకులోనై బాబా చెప్పినా వినకుండా చెఱకు పంట వేశాను. దానిమీద పెట్టుబడి పెట్టిన ₹300/-లు నష్టపోవడమేగాక, ఆ సం॥రం మెట్ట పైరుగూడ వేసుకోలేకపోయాను.

సం॥ 1913లో 70 యేండ్ల వయస్సుగల మా తండ్రి తన అలవాటు ప్రకారం గుర్రంమీద బయటకు వెళ్ళి పక్షవాతంతో యింటికి వచ్చాడు. నేను బాబావద్దకు వెళ్ళి ఊదీ అడిగాను. బాబా, "నేను ఊదీ యివ్వను. అల్లామాలిక్ హై" అన్నారు. నేను ఏడ్చేశాను. నాటికి మూడవరోజున కార్తీక శుద్ధ ఏకాదశీ ఆదివారంనాడు మా తండ్రి మరణించాడు. మరురోజు యథాపూర్వం నేను మశీదుకు వెళ్ళి బాబా పాదాలు వత్తాను".

సాయిబాబాతో నిత్యసాంగత్యం వలన బయ్యాజీ అప్పాజి పాటిల్ హృదయంలో అతనికి తెలియకుండానే, అతని ప్రయత్నము - సాధన ఏమీ లేకనే ఎంతటి ఉత్తమ సంస్కారం కల్గిందో యీ ఒక్క సంఘటన గురించి ఆలోచిస్తే తెలుస్తుంది. ఒకవంక అతని కన్నతండ్రి మృత్యుముఖంలో వున్నాడు. మరోవంక తలుచుకుంటే ఏమైనా చేయగల సమర్థ సద్గురువు సాయి అతని యింటికి కొద్ది దూరంలోనే వున్నారు. కనుక అతడు తన తండ్రిని బ్రతికించమని అనన్యంగా ఆయనను శరణు బొందాడు. అయినప్పటికీ అతనికి సాయి ఊదీ యివ్వనపుడు మరెవరికైనా అయితే ఆయనపట్ల పట్టరాని కోపం వస్తుంది. అంతవరకూ ఆయనపట్ల వున్న భక్తిశ్రద్ధలు అడుగంటిపోతాయి. సాయి తమవల్ల గాకనే తన తండ్రిని రక్షించలేదని అతడు సమాధానపడబోతే సాయి సర్వసమర్థులు, సాక్షాత్తూ భగవంతుడు అన్న విశ్వాసం సడలిపోతుంది. అలాగాక,ఆయనసర్వసమర్థులైనప్పటికీ తన ప్రార్థన మన్నించలేదనుకొంటే ఆయన ప్రేమస్వరూపమని, తన ఏకైక రక్షకులన్న భావం నశించిపోతుంది. అంతవరకూ అతడు గతంలో చేసిన సేవంతా వ్యర్థమని, ఆయన కేవలం తనను వాడుకొన్నారని తలచడం ఆ పరిస్థితుల్లో సామాన్యులకు అన్పించి తీరుతుంది. అటు తర్వాత మళ్ళీ ఆయనను దర్శించడంగూడ కష్టమే. అట్టి మానసిక స్థితిలో సాయి గురించి అతడంతకుముందు వినిన కువిమర్శలు, దుష్ప్రచారాలు - అన్నీ వాస్తవాలన్పిస్తాయి. ఒకవేళ ఎవరైనా ఆ విఘాతానికి తట్టుకొని, మనస్సును సమాధాన పరచుకోగల్గినప్పటికీ అందుకెంతో కాలం పడుతుంది. ఏమైనప్పటికీ పితృశోకమైనా కొంతకాలం సామాన్యులను కృంగదీయక మానదు. కాని బయ్యాజీ పాటిల్ లో యివేవీ కన్పించవు. అతడు తన తండ్రి మరణించిన మరురోజే ఎప్పటివలె ఆయనను దర్శించి పాదసేవ చేసుకున్నాడు. తన తండ్రిని ఎందుకు రక్షించలేదని అతడు బాధగా ఆయననొక్కసారి గూడ అడగలేదు. ఆయనపట్ల అతని భక్తి శ్రద్ధలు, ప్రేమ కించిత్తు గూడా చలించలేదు. అదీ అసలైన భక్తి. అదే సాయికోరే దక్షిణలోని 'నిష్ఠ'. అది అతనికి సాయిసన్నిధి ప్రసాదించిన వరమేనని తలచవచ్చు.

"నాకు భీముని యంతటి బలమని ఎప్పుడూ గర్వంగా చెప్పుకుంటుండేవాడిని. ఒకరోజు వారి పాదాలొత్తాక బాబాను నా చేతులపై ఎత్తి తీసుకువెళ్ళి ధునివద్ద దించాలని ప్రయత్నించాను. అంతకుముందు ఎన్నోసార్లు అలా చేశాను గూడ. కాని ఆరోజు ఆయనను పైకి లేపనే లేకపోయాను. బాబా నన్ను చూచి నవ్వి నా గర్వం అణచివేశారు.

ఆనాడు ద్వాదశి, బాబా నాకు రెండు గుణపాఠాలు నేర్పారు - నేను గర్వించకూడదని, నా తండ్రి మరణించినందుకు శోకించకూడదని. 'నీవెందుకు దుఃఖించాలి? అతడు 5

***మిగతా 29వ పేజీలో***

# ద్వారకామాయి అనుభవమండపము

శ్రీ శిరిడీ సాయి 1918లో తనువు చాలించినా నేటికీ సజీవులే. భక్తుల జీవితాలలో నేటికీ జరుగుతున్న వారి లీలలే అందుకు నిదర్శనం.

నేనొక పాపిని. అయినా సాయియే నా సర్వస్వమని నమ్మిన భక్తుణ్ణి. నేనీరోజొక మనిషిగా వున్నానంటే అది ఆయన అనుగ్రహమే. నాకెన్నో కష్టాలొచ్చాయి. కాని అవన్నీ సాయిబాబా అనుగ్రహం వలన సాయి అనుగ్రహమనే సూర్యుని ముందు కొండలపై మంచులా కరిగిపోయాయి.

నేను ఏప్రిల్ 11, 1977న శిరిడీ వెళ్ళి 23వ తేదీన తిరిగి వచ్చాను. నేను 1962 నుండీ ఒక యింట్లో అద్దెకుంటున్నాను. ఇంటి యజమాని సహృదయుడు. అయితే ఆయన మరణించాక మైనారిటీ తీరని వారి అబ్బాయి తన పెద్దల ద్వారా నాకెన్నో యిబ్బందులు కల్గించనారంభించాడు. చివరకది కోర్టు వ్యవహారం దాకా వెళ్ళింది. ఆ తర్వాత గూడ నేను వారిని పిలిపించి నాకు వారిపట్ల వైరం లేదని అద్దె బాకీ పెట్టలేదని, విధిలేక లాయరు చేత సమాధానం వ్రాయించినా కోర్టులో వారితో తగవు లాడదలచలేదని చెప్పాను. ఇంటి యజమాని కుమారునికి గూడ మా పట్ల ఎట్టి పగాలేదని గూడ చెప్పగలను కాని మేము 1962 నుండీ నేటి వరకూ అదే యింటిలో వుండడం వారి లాయరుకి నచ్చలేదు. కారణం అతని తండ్రికి మా యింటి యజమాని కొన్ని ఆస్తిపాస్తులు తాకట్టు పెట్టి వున్నాడు. ఆ మార్వాడీ పెద్దమనిషి లాయరైన తన కొడుకు ద్వారా మేమున్న యింటిని ఎలాగైనా హస్తగతం చేసుకోదలచాడు. దానికి తగినట్లు మా యింటి ఆసామి కుటుంబమందరూ నిరక్షరులు. యజమానికి మేము సకాలంలో అద్దెలు చెల్లిస్తున్నామని తెలిసిగూడ అక్టోబర్ 1976లో ఆ లాయరు కోర్టు నుండి మాకు వ్యతిరేకంగా ఎక్స్పార్టీ డిక్రీ తీసుకొన్నాడు మేమాయిల్లు ఖాళీ చేయాలని.

అయితే ఆ ఇంటి యజమాని కుటుంబంవారు మాతో మంచిగా వుంటూండడం వలన, మేము సక్రమంగా అద్దెలు చెల్లిస్తున్నందువలన నేను పెద్దగా లెక్కచేయలేదు. కాని మా ప్రతిపక్ష లాయరు మేము ఊరిలో లేనపుడు చూచి ఆ యింటిని స్వాధీనం చేసుకోవాలని వున్నాడు. మేమీసారి శిరిడీ వెళ్ళగానే ఏప్రిల్ 23, 1977 తేదీన కోర్టు పనికి చివరి రోజు తగిన అధికారిని తెచ్చి తాళం తీయించాలనుకున్నాడు. కారణం మరునాటి నించీ కోర్టుకు సెలవులు గనుక మేము ప్రతిచర్య తీసుకోడానికి వీలుండదు. మా అండన సాయి సంకల్పమున్నదని పాపమతడెరుగడు.

నాకొక చిత్రమైన ప్రేరణకల్గి 22వ తేదీన రైలులో హైద్రాబాద్ రాకుండా నేరుగా బస్సులోనే యిల్లు చేరాను. సరిగా అదే సమయానికి ఆ లాయరు అధికారులను తీసుకొని యింటి తాళం తీయించడానికి వచ్చాడు. అప్పుడు 11.30 అయింది. సమయానికి ఇల్లుగలవాళ్ళు గూడ ఎక్కడికో వెళ్ళారు. ఆ కోర్టు గుమస్తా యథావిధిగా యింట్లోని సామాన్లు బయట పడవేయనారంభించాడు. మేము మొదట నివ్వెరబోయాము. అయితే వెంటనే తెప్పరిల్లి ఏమీ కంగారుపడవద్దని మనకు సాయియే వున్నారని నా భార్యతో చెప్పాను.

ఆశ్చర్యం. తక్షణమే ఆ డిక్రీని రద్దు చేస్తూ మా లాయరు విరుద్ధమైన కోర్టు ఉత్తర్వు తీసుకొచ్చాడు. ఆయన గూడ ఆ రోజే వూరి నుండి వచ్చి అనుకోకుండా మా ఫైలు చూచి యిక్కడ జరుగుతున్న విషయం తెలిసి వెంటనే కోర్టు వద్ద 'స్టే' ఆర్డరు తీసుకొచ్చాడు. సమయానికి ఆయన ఆ చర్య తీసుకొనడం, ఆయనే

అన్ని పనులు చేసి నా తరపున 'స్టే' తీసుకురాగల్గడం ఆశ్చర్యంగదూ? తర్వాత మిత్రుల సమక్షంలో అదంతా సాయి దయవలన మాత్రమే సంభవమైందని అంగీకరించాడు.

*- కె. సుబ్రహ్మణ్యం, హైదరాబాద్*

---

నా 30వ ఏట, అనగా 1957లో నాకు కడుపులో విపరీతమైన నొప్పి రానారంభించింది. క్రమంగా నా దేహం శుష్కించనారంభించి ఎన్ని వైద్యాలు చేసినా తగ్గకపోవడంతో నాకా విషయమై మనోవేదన ప్రారంభమైంది. ఇక మానవయత్నమే చాలదని నిశ్చయించుకొని నా యిష్ట దైవమైన శ్రీకృష్ణుని ప్రార్థించసాగాను. అలా కొంతకాలం అభ్యర్థించేసరికి నేను తలచకుండానే ఎందరి మధ్యలోనైనా నామస్మరణలో నిమగ్నమై ఏకాంతమే అనుభవించసాగాను. ప్రతిరోజూ నిద్రలేవగానే శ్రీకృష్ణుణ్ణి తలచుకొంటూ పెద్దగా ఆయన నామాన్ని ఉచ్చరించేవాణ్ణి.

ఒకనాటి తెల్లవారుజామున నాకొక చిత్రమైన స్వప్నమొచ్చింది. తలకు గుడ్డ, వంటికి బారు అంగరఖా ధరించిన ఒక ఫకీరు కూర్చొని దర్శనమిచ్చారు. ఆయనకు పొట్టి గడ్డమూ మీసమూగూడ వున్నాయి. నాకు వెంటనే మెలకువ వచ్చి "ఆహా, వీరే నా గురుదేవులు!" అని బిగ్గరగా అరుస్తూ లేచి కూర్చున్నాను. సరిగా అప్పుడే ఆకాశము తెల్లబారుతోంది. పక్షులు కిలకిలా గానం చేస్తున్నట్లు నా జీవితంలో కొత్త అధ్యాయము ప్రారంభమైనట్లనిపించింది. కాని నాకు దర్శనమిచ్చిన మహనీయులెవరో నాకు తెలియదు. ఆయన నెక్కడకు వెళ్ళి దర్శించాలా అని ఆరాటమారంభమైంది. ఇలానే రోజులు, నెలలు, సంవత్సరాలూ దొర్లిపోయాయి గాని నాకా వివరమే తెలియలేదు. రోజూ ఆనాడు స్వప్నదర్శనమిచ్చిన మహనీయుని స్మరించినమస్కరించుకొంటూండేవాణ్ణి. అలానే కాలం గడచి 1964లో నాకు వివాహమైంది.


నాకు 1970లో హోషంగాబాదుకు ఉద్యోగం బదిలీ అయింది. అక్కడకు వెళ్లాక ఒకరోజు నేను కొన్ని వస్తువులు ఒక షాపులో కొనుక్కోడానికి వెళ్ళాను. అక్కడ మాలవేసియున్న ఒక చిత్రపటం చూచాను. పరికించి చూస్తే నాకు ఆనాడు స్వప్న దర్శనమిచ్చిన మహనీయునిదే ఆ చిత్రం! ఆయన గురించి విచారించగా ఆయన శిరిడీ సాయిబాబా అని ఆ షాపు యజమాని చెప్పాడు. నేనెంత అడిగినా ఆయన శిరిడీ అనే గ్రామంలో వుండేవారని, ఆ గ్రామం అహ్మదునగర్ జిల్లాలో వున్నదనీ మాత్రమే చెప్పగల్గాడు. ఎంతగా అడిగినా యింకేమీ చెప్పలేకపోయాడు. ఇక వారి గురించిన వివరాలు ఎలాగైనా వారే నాకు తెల్పాలని వారినే ప్రార్థించుకోనారంభించాను. ఆ జిజ్ఞాస నాటినుంచీ మరీ తీవ్రమైంది. ప్రతి పుస్తకాల షాపులోను, ఆధ్యాత్మిక పత్రికలోనూ వారి గురించిన పుస్తకాలు, వ్యాసాలు దొరుకుతాయేమోనని వెదకసాగాను.

ఆగస్టు 1972లో నేనీ జిల్లాలోని పిపరియా పట్టణానికి ఉద్యోగధర్మంలో పర్యటనకు వెళ్ళాను. అక్కడ నా మిత్రులొకరు తమ ఇంటికి నన్నాహ్వానించారు. మేము వారిల్లు చేరగానే అతడు "మీరు మొదట శిరిడీ సాయిబాబా దర్శనం చేసుకోండి" అన్నారు. నా హృదయం పులకించింది. పూజాగృహంలోకి వెళ్ళేసరికి చక్కని సాయిబాబా పటమున్నది. కొద్ది నిమిషాలు వారిని తనివితీరా దర్శించాక నా మిత్రుడు ఊదీ, ప్రసాదమూ యిచ్చాడు. తర్వాత ఒక గంటసేపు శ్రీ సాయిబాబా గురించి ఎన్నో వివరాలు చెప్పాడు.

మరురోజు హోషంగాబాద్‌లో ఇల్లు చేరగానే నాకు అంతకుముందు స్వప్నంలో మహనీయుడు దర్శనమీయడం గురించి, తర్వాత వారు శిరిడీ సాయిబాబా అని తెలియడం గురించీ చెప్పి ఆయన గురించి నాకు పిపరియాలో తెలిసిన వివరాలన్నీ చెప్పాను. తర్వాత అక్టోబర్ 1972లో శిరిడీ దర్శించి, గురువారం జరిగే పల్లకీ ఉత్సవంలో గూడ పాల్గొన్నాను. తర్వాత ద్వారకామాయిలో వారి పటానికి సాష్టాంగ నమస్కారం చేసి నా ఆరోగ్యము, ఉద్యోగ సమస్యలు తీర్చి నా మనోవేదన తొలగించమని ప్రార్థించాను. నాకొక మగ బిడ్డను అనుగ్రహించమనిగూడ కోరాను.

మేము తిరిగి యిల్లు చేరిన కొద్ది వారాలలోనే నాకు ఉద్యోగంలో ప్రమోషన్ వచ్చింది. రెండు నెలలలో నా భార్య గర్భవతియై 1973 నాకొక మగ శిశువు జన్మించాడు. క్రమంగా మా బంధుకోటియంతా సాయిభక్తులయ్యారు.

*- బి.కె. దూబే (హోషంగాబాదు)*



నాకు భగవద్గీత నిత్యపారాయణ చేయడం, శ్రీ రాఘవేంద్ర స్వాములవారి స్తోత్రాలు మొ॥నవన్నీ చదవడం చాలా సంవత్సరాలుగా వున్న అలవాటు. మా అమ్మాయి చి ॥ సౌ ॥ క మ లా రా మ చ ం ద ర్ విజయవాడ వచ్చినప్పుడల్లా బాబా చరిత్ర చదవమని చెప్పేది. అప్పట్లో నా నిత్యపారాయణ గ్రంథాలే తప్ప బాబా చరిత్ర చదవాలనిపించేదికాదు. వాళ్ళింట్లో బాబా పూజ, చరిత్ర పారాయణం చేస్తారు. వాళ్ళ అమ్మకి బాబా గురించి చెప్పినా విని వూరుకోవడమే గాని బాబాపట్ల శ్రద్ధ చూపేది కాదు.

6సం॥ క్రిందట ఓసారి హైద్రాబాద్ వెళ్ళినప్పుడు మా అమ్మాయి ఆచార్య శ్రీ భరద్వాజ మాస్టరుగారు వ్రాసిన శ్రీ సాయిలీలామృతం గ్రంథం యిచ్చి చదవమంది. కొంతభాగం వాళ్ళింట్లో వున్నప్పుడు చదివి మిగతాది ఆ వూళ్ళోనే వున్న మా చిన్న అబ్బాయి వాళ్ళింట్లో పూర్తి చేశాను. ఆ రోజు రాత్రి నాకు స్వప్నంలో గదాధరుడి చరిత్ర చదవమని ఎవరో చెప్పారు. గదాధరుడంటే శ్రీరామకృష్ణ పరమహంస కదా అనుకొన్నాను. అదే రోజున మా అమ్మాయి వాళ్ళింటికి అనుకోకుండా వెళ్ళడమయింది. వాళ్ళు శ్రీ రామక్రిష్ణ పరమహంస జీవితచరిత్ర చదివారుట. చాలా బాగుందని నన్నూ చదవమన్నారు. స్వప్నంలో గదాధరుడి చరిత్ర చదవమనడం, చదివించడం బాబా లీలగా తలచాను. అప్పట్నించీ నాకు, మా ఆవిడకీ బాబాపట్ల భక్తిశ్రద్ధలు ఏర్పడ్డాయి. మా అమ్మాయి వాళ్ళు చదివే గ్రంథాలన్నీ మేమూ చదవడం మొదలుపెట్టాము. అలాగే అప్పట్నించీ మాకు సాయి కృపాలీలలు అనుభవమవుతున్నాయి. అందులో ఒకటి వ్రాస్తున్నాను.

ఒకసారిసికింద్రాబాద్ లో డా॥ ఎ. కె. చారిగారి ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకోవడం కోసం జేరాను. వెళ్ళేటప్పుడు ఆటోలో ఎదురుగా బాబా ఆశీర్వదిస్తున్న ఫొటో వుంది. మేము కూడా ఒక ఫొటో తీసుకెళ్ళాము. మంచానికి ఎదురుగా గోడకి తగిలించాడు మా మనవడు. ఆపరేషన్ ముందురోజు మధ్యాహ్నం సుమారు 2 గం॥కి నేను కళ్ళుమూసుకొని పడుకొన్నాను. ఎదురుగా వున్న ఫోటోలోంచి బాబా వచ్చి నన్ను ఆశీర్వదించి తలుపు తీసుకొని వెళ్ళినట్టుగా ఫోటోలోకి వెళ్ళి పోయారు. అప్పుడు సంతోషంతో నేను "బాబా" "బాబా" అని వేసిన కేకలకు మాఅబ్బాయి నిద్రపోకుండా లేచి :ఏమిటి కేకలేస్తున్నారు?' అని అడిగాడు. ఆ తర్వాత ఆపరేషన్ అయి నేను ఆరోగ్యవంతుణ్ణి అయ్యాను. అంటే ఆ మహానుభావుడి దయే! ఆరోజు బాబా నిలువెత్తుగా నా ముందు నిలుచున్న దృశ్యమే యిప్పటికీ నాకు చాలా ఆనందాన్ని కలుగజేస్తూ వుంటుంది. సాయిబాబా పత్రిక, స్థవన మంజరి నాకు చాలా మనశ్శాంతిని, ఆనందాన్ని కలుగజేస్తున్నాయి. ఈ వయస్సులో నాకు బాబా నామాన్ని నిరంతరం జపించడంకన్నా కావల్సిందేముంది! ఎన్నో ఉత్తమ గ్రంథాల్ని రచించి తద్వారా ఎందరెందరినో భగవదనుగ్రహానికి పాత్రులుగా జేసున్న పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారికి కృతజ్ఞతాపూర్వక వందనములు!!

– ***ఆరణి హనుమంతరావు,***
***విజయవాడ***

# ఆచార్యుని అద్భుత లీలలు

పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ లీలావైభవాన్ని గూడూరు వాస్తవ్యులైన వేంకటేశ్వర్లుగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు--

నేను 1970-72 సంవత్సరాలలో విద్యానగరు NBKR కళాశాలలో ఇంటర్మీడియట్ చదివాను. పూజ్యశ్రీ మాస్టరుగారు మా క్లాసుకి వచ్చేవారు కాదు. కానీ ప్రతిరోజూ నేను వారిని కాలేజీలో చూస్తూండేవాడిని. ఏరోజూ నేను సత్సంగానికి పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంటికి వెళ్ళలేదు. కాలేజి అయిపోయాక పూజ్యశ్రీ మాస్టరుగారు బ్యాడ్మింటన్ ఆడేవారు. అప్పుడు మాత్రం చూస్తుండేవాడిని. పూజ్యశ్రీ మాస్టరుగారు ఎప్పుడు ఫ్రెష్ గా వుండేవారు. ఆయనని చూసిన కొద్దీ చూడాలనిపించేది. నేను డిగ్రీ చదువుకోసం నెల్లూరు వెళ్ళిపోయాను. మా బంధువు బలరామయ్య డిగ్రీలో ఇంగ్లీష్ (లిటరేచర్) తీసుకుని విద్యానగరులోనే వుండిపోయాడు. అతని క్లాసుకి పూజ్యశ్రీ మాస్టరుగారు రావడం వల్ల వారితో చనువు పెరిగి సత్సంగాలకి వెళ్ళేవాడు.

నా డిగ్రీ పూర్తవ్వగానే రైల్వేలో చెన్నైలో ఉద్యోగం వచ్చింది. నేను గూడ్స్ బండిలో గార్డు గా పనిచేసేవాడిని. చెన్నై నుంచి గూడూరు ట్రైన్లో వెళ్ళినప్పుడల్లా గూడలికొండ కనిపించేది. ఆ కొండని చూసినప్పుడల్లా అక్కడ దిగి పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనం చేసుకోవాలనిపించేది. అలా చేసివుంటే నాకు వారితో సాంగత్యం లభించేదేమో!

1980లో బ్యాంకులో ఉద్యోగము వచ్చింది. రైల్వే ఉద్యోగానికి రాజీనామా చేసి చిత్తూరుజిల్లాకి బ్యాంకు ఉద్యోగం నిమిత్తం వెళ్ళిపోయాను. 1984, 85 సంవత్సరాలలో మా బలరామయ్య నన్ను చాలాసార్లు ఒంగోలుకి రమ్మని పిలిచాడు. కానీ నేను వెళ్లలేదు. శ్రీసాయిలీలామృతం గ్రంథం కూడా పంపించాడు. నేను దానిని చదవనేలేదు.

1986లో నేను గూడూరులో ఒక ఇల్లు కొన్నాను. ఆ ఇల్లు కొనడం నా అదృష్టమని చెప్పవచ్చు. ఎందుకంటే 1977 నుంచి రెండు మూడు సంవత్సరాలపాటు పూజ్యశ్రీ మాస్టరుగారి విద్యార్థి అయిన శ్రీ కొత్తూరు హరిబాబు ఆ ఇంట్లోనే అద్దెకి వుండేవాడట. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు ఆ ఇంటికి చాలాసార్లు వచ్చారట. పూజ్యశ్రీ మాస్టరుగారిని విద్యానగర్లో రెండు సంవత్సరాల పాటు ఊరికే చూసి నమస్కారం చేసుకున్నందుకే వారు అడుగుపెట్టిన ఇల్లు నాకు ఇప్పించారు!

2004నుంచి 2008 వరకు చెన్నై బ్యాంకులో అసిస్టెంట్ మేనేజరుగా పనిచేసాను. తరవాత బదిలీకి నెల్లూరుగాని, తిరుపతిగాని అడిగాను. కానీ చిత్రంగా కావలికి బదిలీ చేశారు. అది నా జీవితంలో గొప్ప మలుపు. మా కుటుంబాన్ని గూడూరు సొంత ఇంట్లో వుంచి నేను కావలి -- గూడూరు ఉద్యోగానికి తిరుగుతుండేవాడిని. మా బలరామయ్య సహోద్యోగి ఒకతను కావలిలో వుండేవాడు. అతనితో మొదటిసారి బాబాగుడికి (శిరిడి ధునిలోని అగ్నిని కలిపిన గుడికి) వెళ్లాను. ఇక అక్కడినించి ప్రతిరోజూ బాబాగుడికి వెళ్లడం, పూజ్యశ్రీ మాస్టరుగారి సాహిత్యం చదవటం, వారి గ్రంథాలు చదివి చాలా ఆనందించటం .... ఇలా జరిగేది. ఒకరోజు బస్సులో ప్రయాణిస్తుంటే బస్సు పక్కనుంచి ఒక కారు దాటుకుని పోయింది. దాని వెనుక పూజ్యశ్రీ మాస్టరుగారిది పెద్దపటం కట్టి వుంది. దానిని చూడగానే నాకు ఒళ్ళు పులకరించింది. 'పూజ్యశ్రీ మాస్టరుగారు నన్ను ముందుండి నడిపిస్తున్నారు' అనిపించింది.

2013లో పూజ్యశ్రీ మాస్టరుగారు నాకు ప్రాణదానం చేశారు. అప్పుడు నేను చిత్తూరుజిల్లాలో ఒక పల్లెటూరులో పనిచేస్తున్నాను. తిరుపతిలో రైలు దిగి అక్కడి నుంచి బస్సులో వెళ్ళాలి.

ఒకసారి అలా వెళుతుండగా తిరుపతి రైల్వేస్టేషనులో నాకు అకస్మాత్తుగా గుండెనొప్పి వచ్చింది. చాలా నీరసం వచ్చేసి నడవలేకుండా వున్నాను. పరిస్థితి ఏమీ బాగాలేక వెనక్కి ఇంటికి వెళ్ళిపోదామని నెమ్మదిగా బైటికివచ్చి గూడూరు వెళ్ళే బస్సు ఎక్కి కూర్చున్నాను. ఇంటికి వెళ్లేసరికి నొప్పి తగ్గిపోయింది. కానీ మా ఇంట్లో వాళ్లు ఆసుపత్రికి తీసుకునివెళ్లారు. అక్కడ డాక్టర్ పరీక్ష చేసి, "స్ట్రోక్ చాలా తీవ్రంగా వచ్చింది. ఇంతసేపూ ఏమీ కాలేదంటే చాలా ఆశ్చర్యంగా వుంది" అని చెప్పి బైపాస్ సర్జరీ చెయ్యాలన్నారు. చెన్నై అపోలో ఆసుపత్రిలో సర్జరీ చేయించుకున్నాను. ఆపరేషన్ ఐన రెండవ రోజున స్పృహ వచ్చింది. రావడంతోనే పూజ్యశ్రీ మాస్టరుగారు గుర్తుకువచ్చారు. ఇంకా మంచం మీదనించి లేవలేకపోతున్నాను.

అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారికి ఒక ప్రార్థన చేసుకున్నాను. "తండ్రీ, నిన్ను స్మృతిమాత్ర ప్రసన్నుడంటారు కదా! ఒక్కసారి నీ దర్శనభాగ్యాన్ని ప్రసాదించు. రోజూలాగా నీ పూజ, పారాయణ చెయ్యలేను" అని ప్రార్థిస్తూ మళ్ళీ నిద్రలోకి జారుకున్నాను. అప్పుడు స్వప్నంలో పూజ్యశ్రీ మాస్టరుగారు నా ఎదురుగా వున్న పడకమీది అతన్ని పలకరించడానికి వచ్చినట్లు వచ్చి నా వైపు తిరిగారు. వారి రూపం ఇప్పటికీ నాకు కళ్ళకు కట్టినట్లు వుంటుంది. తెల్ల పంచె, తెల్లటి చొక్కా వేసుకుని ఎంతో తేజస్సుతో మెరిసిపోతున్నారు! వారి చూపు నామీద పడగానే నా ఆందోళన పూర్తిగా తొలగిపోయి మనస్సంతా హాయిగా ప్రశాంతమైపోయింది. మళ్ళీ ఆస్పత్రినుంచి డిశ్చార్జ్ అయ్యేరోజున ఒక స్వప్నం వచ్చింది. అందులో పూజ్యశ్రీ మాస్టరుగారు స్కూటరు మీద ఎక్కడికో హడావిడిగా వెళుతున్నారు. "నేనూ రానా మాస్టరుగారూ?" అంటే, "నువ్వు నెమ్మదిగా రా! అక్కడ మందిరం కడుతున్నారు. పనుంది, తొందరగా వెళ్ళాలి!" అన్నారు. ఆ కలకి అర్థం 2016లో తెలిసింది.

నేను 2015లో రిటైరయ్యాను. వెంటనే తపోవనం వెళ్లి పూజ్యశ్రీ మాస్టరుగారికి సాష్టాంగపడి, 'నన్ను ఏ ఇబ్బందులు లేకుండా పదవీ విరమణ చేయించారు. హృద్రోగంనుంచి రక్షించి మరుజన్మను ప్రసాదించారు. కనుక మిగిలిన ఈ జీవితమంతా మీ సేవలోనే గడిపేటట్టు అనుగ్రహించ'మని నమస్కారం చేసుకున్నాను. అప్పటినుంచి వారానికి నాలుగైదు రోజులు.. వీలైతే రోజూ, గూడూరు నుంచి విద్యానగరుకు వచ్చేవాడిని. మధ్యాహ్న భోజనం తెచ్చుకుని సాయంత్రం వరకూ అక్కడే వుండి పారాయణ చేసుకునేవాడిని. ఎంతో ప్రశాంతంగా వుండేది. నేను చదువుకునే రోజులలో పోగుట్టుకున్న వారి సన్నిధిని ఇప్పుడు పొందినట్లు అనిపించేది.

ఆ సమయంలో ఒకరోజు హైదరాబాదునుంచి శ్రీ జి.వి.రావుగారు వచ్చారు. "తపోవనం పునరుద్ధరణ కార్యక్రమం చేయాలి. ఎవరైనా ఒకరు ఇక్కడ పనులని పర్యవేక్షణ చేస్తే బాగుంటుంది" అన్నారు. నేను చూసుకుంటానని వారితో చెప్పాను. ఆరకంగా నాకు ఆరునెలలపాటు రోజూ తపోవనంలో వుండి సేవ చేసుకునే అవకాశం వచ్చింది. నాకు 2013లో వచ్చిన కలలో పూజ్యశ్రీ మాస్టరుగారు, 'మందిరం పనులున్నాయి, తొందరగా వెళ్ళాలి. నువ్వు వెనకాల రా!' అని చెప్పినది ఇప్పుడు ఆచరణలోకి వచ్చిందనిపించింది.

ఇక్కడ సేవ అయిపోయిన వెంటనే, "శిరిడిలో అన్నదానం (అక్షయ పాత్ర) ప్రారంభమవుతోంది. అక్కడకి వెళ్లగలుగుతారా?" అని గుత్తి శ్రీనివాస్ గారు అడిగారు. నాకు పూజ్యశ్రీ మాస్టరుగారి కరుణకు కళ్ళవెంట నీళ్లు వచ్చాయి. నేను ఎప్పుడూ శిరిడీకి వెళ్ళలేదు. ఒక్కసారి రిటైరైన వెంటనే వెళ్ళివచ్చాను అంతే! నెలకి పది రోజులు శిరిడీలో వుండే అవకాశం వచ్చింది. అంతేకాదు, ఇక్కడనుంచి ప్రసాదం తీసుకుని వెళ్లి చావడిలో నివేదన చేయాలి. నాకు అలా మూడు, నాలుగుసార్లు అవకాశం వచ్చింది. ఒక గురువారం నేను ప్రసాదం తీసుకుని చావడికి వెళుతుంటే దారిలో ఒకతను మరాఠీ మాట్లాడుతూ, "ఈరోజు మీరు ద్వారకామాయి లో నివేదన ఇవ్వండి" అని అక్కడకి తీసుకువెళ్లాడు. అదొక అద్భుతం!

ఒకసారి ఉగాదికి గూడూరులోనే వుండిపోయాను. భోజనం చేసిన తరువాత ఆ పండగపూట గురువుగారి దర్శనానికి వెళ్లకుండా వుండటమేమిటనిపించి వెంటనే కొన్ని విడిపూలు, బిస్కెట్ ప్యాకెట్లు తీసుకొని విద్యానగరుకు వెళ్ళాను. నేను వెళ్లేసరికి పూజారి మల్లికార్జునరావుగారు తపోవనంలో పూజ్యశ్రీ మాస్టరుగారి పాదుకలకు పూజ చెయ్యడానికి కూర్చున్నారు. సమయానికి నా వద్దనున్న బిస్కెట్లు, పువ్వులు అక్కడ సమర్పించుకున్నాను. నాకు ఎంతో ఆనందం వేసింది. నాకు

పండగపూట గురువుగారి దర్శనభాగ్యం కలిగింది. 2016నుంచి మా ఇంట్లో ప్రతి శనివారం సత్సంగం జరుగుతోంది. మా సత్సంగంలో కూడా చాలామందికి మంచి అనుభవాలు జరిగాయి.

ఈవిధంగా పూజ్యశ్రీ మాస్టరుగారు నా వెంట వుండి వారికి సేవచేసుకునే భాగ్యాన్ని ప్రసాదిస్తూ నన్ను నడిపిస్తున్నందుకు శత సహస్ర కోటి కృతజ్ఞతలు తెలియచేసుకుంటూ ప్రణామాలర్పిస్తున్నాను.

జై సాయి మాస్టర్!!

## బయ్యాజీ అప్పాజీ పాటిల్

23వ పేజీ తరువాయి

నెలల్లో తిరిగి వస్తాడు' అన్నారు. ఆయన చెప్పిన సమయానికే నాకు కొడుకు పుట్టాడు.

బాబా తమ చివరి రోజున నాకు చివరిసారిగా నీతి బోధించారు. కాకాదీక్షిత్‌ను అక్కడనుండి పంపివేశాక నాకొక నీతినేర్పి, 'అది ఎవరికీ చెప్పవద్దు, చెప్పావంటే చచ్చిపోతావు!' అన్నారు. తర్వాత ఆయన, 'నేను వెళ్ళిపోతున్నాను. నన్ను వాడాకు తీసుకుపోండి. బ్రాహ్మణులంతా అక్కడ నావద్దనే నివసిస్తుంటారు' అని చెప్పి నన్ను ఆనుకుని శరీరం విడిచారు. ఆ తర్వాత నానా నిమోన్కర్ వారి నోట్లో నీరుపోస్తే అదంతా బయటకు వచ్చేసింది. ఆ నీరు పట్టుకోవాలని వారి గడ్డంక్రింద నాచేయి పెట్టాను."

## అసలు పండుగలు చేసుకోవడమంటే ఏమిటి?

03వ పేజీ తరువాయి

విరగడమేనట. ఆయనను బైజాబాయి ప్రేమతో సేవించినందుకు ఆమెను, ఆమె బిడ్డడైన తాత్యానుగూడ సాయి ఎంత ప్రేమగా చూచుకొన్నారో! మహల్సాపతి మరియు మేఘుడినిగూడ ఆయనలానే చూసుకొన్నారు. కృతజ్ఞతన్నది ధర్మాచరణకు, ఆధ్యాత్మికతకూ గూడ మూలస్తంభమని చెప్పవచ్చు. అందుకే మన ధర్మశాస్త్రాలన్నీ భగవంతుని తర్వాత మనకు పుట్టుకనిచ్చి పోషించిన తల్లిదండ్రులకు ఎప్పుడూ కృతజ్ఞులమై వుండాలని చెప్పాయి. రాముడు, కృష్ణుడు తమ తల్లిదండ్రుల, గురువుల పట్ల ఎంత కృతజ్ఞతతో వ్యవహరించారో! ఆదిశంకరులు, శ్రీపాద శ్రీవల్లభులు, శ్రీ నృసింహసరస్వతులు తమ తల్లుల మాటలకు అందుకే కట్టుబడ్డారు. శ్రీ సాయి గూడ గత జన్మలలో తమ తల్లి మరియు సోదరులపట్ల – వారి అవగుణాలను గూడ లక్ష్యపెట్టక తమ ధర్మం తామెంత చక్కగా నిర్వహించారో, తమకు బట్టలునేసే ఉద్యోగమిచ్చిన యజమానిపట్ల ఎంత విధేయతతో ప్రవర్తించారో గమనించాలి.

ఇలా మన ధర్మంయొక్క, పండుగలయొక్కతత్త్వమేమిటో,వాటిలో దాగియున్న భావమేమిటో తెలిసికొని మనం పండుగలు చేసుకొంటే మన జీవితాలు సార్థకమౌతాయి. లేకుంటే నిరర్థకమౌతాయి. తెలుసుకొని భావయుక్తంగా చేసుకుంటే పండుగ, లేకుంటే దండుగ! ●

## పరిప్రశ్న

07వ పేజీ తరువాయి

ఆయనలేడుగదా అంటే, తక్కిన అష్టాదశ పురాణాలకూ మూలమనదగు విష్ణుపురాణంలో దత్తావతారమున్నది. కృష్ణావతారమేలేదు! భారతము–వనపర్వము ప్రకారం భగవంతుని అవతారాలు, లేక ప్రాదుర్భావాలు అనంతము.

శ్రీ దత్తాత్రేయుణ్ణి గురించి ఉపనిషత్తు లేదనడం సరిగాదు. శ్రీ దత్తాత్రేయోపనిషత్తు వున్నది. శాండిల్యోపనిషత్తు ఈయన బ్రహ్మ, విష్ణు, శివ, సకల దేవతామయుడుగా కీర్తిస్తుంది. అవధూతోపనిషత్తు గూడ ఆయననే కీర్తిస్తుంది. అవధూతయన్న నామము ఆయనయందే పూర్ణమైనట్లు యీ ఉపనిషత్తు చెబుతున్నది.

ఇక ఒక్క సమాధానం చాలు. శోత్రియతకు మారు పేరనదగిన వాసుదేవశాస్త్రి యనే మహాపండితునితో శ్రీ గోవిందస్వామి దత్తోపాసన చేయమంటే ఆయన "నేను వైదికుణ్ణి, సూర్యాగ్నులనుపాసిస్తున్నాను, మరల దత్తోపాసన ఎందుకు? అన్నారు. కాని చివరకు యీయన దత్తోపాసకులై సర్వ పురాణాంతర్గములైన దత్త కథలను క్రోడీకరించి 'శ్రీదత్త మహాత్మ్యము', 'శ్రీదత్త పురాణము' అన్న గ్రంథాలే గాక 'శ్రీదత్తాత్రేయ వేద పాదస్తుతి' ని వ్రాశారు. ప్రామాణికము గాకుంటే ఆయన అలా చేసియుండరు. ●

## పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర | 450-00 |
| శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర | 90-00 |
| శ్రీ సాయి లీలామృతము | 99-00 |
| శ్రీ గురు చరిత్ర | 99-00 |
| శ్రీ సాయి సన్నిధి | 120-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 125-00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము | 80-00 |
| సాయినాథ పూజ | 40-00 |
| సాయినాథ స్థవనమంజరి | 10-00 |
| శిరిడి ఆరతులు | 15-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు | 10-00 |
| సత్సంగము-భజన | 5-00 |
| శిరిడి క్షేత్ర సందర్శనము | 40-00 |
| విజ్ఞాన వీచికలు | 99-00 |
| పరిప్రశ్న | 99-00 |
| మతమెందుకు? | 50-00 |
| ఏది నిజం? | 50-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 99-00 |
| బుద్ధధ్యాన హృదయం | 49-00 |
| దత్తావతార మహత్యం | 75-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 128-00 |
| పురుషసూక్త రహస్యం | 40-00 |
| సాయిసూక్తి-ఆచార్యవాణి | 10-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 49-00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | 49-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 70-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 49-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 80-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 49-00 |
| స్వామి సమర్థ(అక్కల్కోట స్వామి) | 49-00 |
| మనము-మన సంస్కృతి | 70-00 |

### ఇతర ప్రచురణలు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 120-00 |
| అవధూత చివటం అమ్మ | 70-00 |
| శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు | 125-00 |
| మరో నందదీపం | 80-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 175-00 |
| బాలల శ్రీ సాయి లీలామృతము | 25-00 |
| మహాపురుషుడు | 50-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు (2) | 125-00 |
| బాలల శ్రీ సాయి సన్నిధి | 50-00 |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba the Master | 175-00 |
| Sree Guru Charitra | 99-00 |
| Supreme Master(Swami Samartha) | 99-00 |
| Sai Baba of Shiridi and His Teachings | 99-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 99-00 |
| Children's SaiBaba the Master | 60-00 |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sai Baba(Hindi) | 150-00 |
| Sai Leelamrutham(Kannada) | 150-00 |
| Sai Baba Jeevitha Charitham(Malayalam) | 220-00 |
| Sai Baba Leelamrutham(Tamil) | 175-00 |
| Sri Guru Charitra (Hindi) | 99-00 |
| Swami Samartha (Kannada) | 99-00 |
| Sri Guru Charitra(Kannada) | 45-00 |
| Shiridi Aarathi(Tamil) | 15-00 |
| Stavana Manjari(Tamil) | 10-00 |
| Tibet Yogi Milarepa Jeevitha Charitra(kannada) | 55-00 |
| Sri Sainath Prabodhamruthamu (Kannada) | 65-00 |

**SRI GURUPADUKA PUBLICATIONS, c/o SRI MANGA BHARADWAJA TRUST,**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone : +91 - 74160 41550
Branch Office: Kondaiah Bunk Street, Kothapet, Ongole, Prakasam Dt., Andhra Pradesh.
Phone: 08592 233271
**Send DD in favour of "Sri Manga Bharadwaja Trust(Publications)", payable at Hyderabad or Ongole.**


2022


2022

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.



సాయిబాబా మాసపత్రిక పాఠకులందరికీ ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు!



IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET,
KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.